
# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!


WWW.SUBHODAYAMDAILY.COM

ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 2 | సంచిక : 234 | ఎడిటర్ : వి. శ్రీనివాసరావు | పేజీలు :8 | ఆదివారం 16 నవంబర్ 2025

## వలంటీర్లుకు దీటుగా
# మరో వ్యవస్థ

- పోరాటం చేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట
- అయితే ఇప్పుడు సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టారు నారా లోకేష్
- మండల, పంచాయితీ, క్లస్టర్, బూత్ స్థాయిలో టిడిపి కమిటీలను నియమించారు
- ఆ కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సైతం..
- పదవుల స్వీకరణ మాదిరిగా నిర్వహిస్తున్నారు



**విజయవాడ**

తెలుగుదేశం పార్టీ పై ఫుల్ ఫోకస్ పెట్టారు నారా లోకేష్. ప్రస్తుతం ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ ఉన్నారు. కానీ మంత్రి లోకేష్ మాత్రం అనధికారికంగా పార్టీని నడుపుతున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం ఉండి.. పోరాటం చేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశారు. పదవుల నియామకం సమయంలో వారు పార్టీకి చేసిన సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటువంటి వారికి మాత్రమే పదవులు కట్టబెట్టారు. అయితే ఇప్పుడు సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టారు నారా లోకేష్. మండల, పంచాయితీ, క్లస్టర్, బూత్ స్థాయిలో టిడిపి కమిటీలను నియమించారు. ఆ కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సైతం.. పదవుల స్వీకరణ మాదిరిగా నిర్వహిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పార్టీలు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నట్టే. ప్రాంతీయ పార్టీలకు అది అవసరం కూడా. ఇప్పటికే బీమా సదుపాయం కల్పించి రికార్డు సృష్టించారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఈ బీమా వర్తింపజేసేలా చేశారు.దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ అవి కొద్ది రోజులకే అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. అటువంటి ఇబ్బందులే తెలుగుదేశం పార్టీకి ఎదురయ్యాయి. - మిగతా3లో

## అమరావతి రాజధాని
# మాత్రమే కాదు

**భవిష్యత్తు తరాలకు స్థిరమైన వారసత్వం**

**సీఐఐ సదస్సులో మంత్రి నారాయణ**



**విశాఖపట్నం**

అమరావతి రాజధానిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేసారు..అమరావతి నిర్మాణం ద్వారా భవిష్యత్తు తరాలకు స్థిరమైన రాజధానిని అందిస్తున్నామన్నారు...విశాఖలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ప్లీనరీ సెషన్ లో స్థిరమైన నగరాలు %-% ఫ్రం విజన్ టు ఇన్వెస్ట్మెంట్స్ అనే అంశంపై మంత్రి నారాయణ ప్రసంగించారు...అమరావతి ప్రజారాజధానిని ప్రపంచ స్థాయి రాజధానిగా నిర్మించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను దేశవిదేశాల పారిశ్రామికవేత్తలకు మంత్రి నారాయణ వివరించారు...అటు అమరావతిపై నిపుణులతో పాటు పెట్టుబడిదారులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.సదస్సులో మంత్రి నారాయణ అమరావతిపై ఇంకా ఏమన్నారంటే.. అమరావతి ప్రజా రాజధాని 217 చ. కి.మీ.విస్తీర్ణంతో దేశంలోని రాజధాని - మిగతా3లో



# కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరు

- సూరత్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు..
- బీహార్ ప్రజలను కలవకుండా సూరత్‌ను వదిలి వెళ్తే.. ప్రయాణం వృథా అయినట్లుగా అనిపిస్తుంది
- బీహారీ సోదరుల మధ్యకు వచ్చి ఈ విజయోత్సవంలో భాగం కావడం తన బాధ్యత
- బీహార్ ప్రజలకు రాజకీయాలు నేర్పించాల్సిన అవసరం లేదు
- వారు ప్రపంచానికి రాజకీయాలు నేర్పిస్తారు

## నౌగామ్‌లో పేలుడు ఉగ్రకుట్ర కాదు.. ప్రమాదమే

- శాంపిల్స్ తీస్తుండగా భారీ విస్ఫోటనం
- ఈ దాడి తమ పనేనని ప్రకటించిన జైషేకు చెందిన అనుబంధ సంస్థ
- ఉగ్రవాద సంస్థ ప్రకటనను ఖండించిన డీజీపీ



## వరల్డ్ ఎకనమిక ఫోరంతో
# ఏపీ కీలక ఒప్పందం




- ఏఐ యూనివర్సిటీ ఏర్పాటులో భాగస్వామికండి
- సీఐఐ రెండో రోజు రూ.48,430 కోట్ల పెట్టుబడులు
- శ్రీ సిటీకి 6వేల ఎకరాలు భూములిస్తాం
- సీఐఐ సదస్సు రెండో రోజూ వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం చంద్రబాబూ

**విశాఖపట్నం**

సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజైన శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రముఖ సంస్థల ప్రతినిధులతో వరుసగా భేటీ అయ్యారు. ముందుగా ఎల్జీ కెమ్ చీఫ్ సస్టైనబిలిటీ స్ట్రాటజీ ఆఫీసర్ యున్జోకోతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలోని కాకినాడ లేదంటే మూలపేటల్లో ఎల్జీ కెమ్ నాఫ్తా క్రాకర్ కాంప్లెక్స్, పాలిమర్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ముందుకు రావాలని సీఎం ఈ సందర్భంగా ప్రతిపాదించారు. జేఎస్‌డబ్ల్యుతో కలిసి ఎల్జీ కెమ్ ఏర్పాటు - మిగతా3లో

## ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరం



- ఓటు హక్కు: జెన్ జెడ్ యువతకు నటుడు విజయ్ కీలక సందేశం
- వీడియోను విడుదల చేసిన నటుడు విజయ్
- ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచన
- రాజ్యాంగం ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కులలో ఓటు హక్కు ఒకటి అన్న విజయ్

# కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరు

**సూరత్:** బీహార్ ఎన్నికలు కులతత్వ విషాన్ని తిరస్కరించాయని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. గుజరాత్ సూరత్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిపక్షాలపై విరుచుకుపడుతూనే.. గుజరాత్‌లో నివసిస్తున్న బీహార్ ప్రజలను ఆయన పలకరించారు. ప్రధాని మాట్లాడుతూ.. బీహార్ ప్రజలను కలవకుండా సూరత్‌ను వదిలి వెళ్తే.. ప్రయాణం వృథా అయినట్లుగా అనిపిస్తుందన్న ఆయన.. గుజరాత్‌లో ముఖ్యంగా సూరత్‌లో నివసిస్తున్న బీహారీ సోదరుల మధ్యకు వచ్చి ఈ విజయోత్సవంలో భాగం కావడం తన బాధ్యత అన్నారు. బీహార్ ప్రజలకు రాజకీయాలు నేర్పించాల్సిన అవసరం లేదని, వారు ప్రపంచానికి రాజకీయాలు నేర్పిస్తారన్నారు.

బీహార్ కుల ఆధారిత రాజకీయాలను తిరస్కరించిందన్న ఆయన.. బీహార్ నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని చెప్పారు. ఎక్కడికి వెళ్లినా బీహార్ ప్రతిభను చూస్తారన్నారు. మా ప్రాథమిక ఆలోచన దేశం ముందు అని.. గత రెండు సంవత్సరాలుగా ఈ బెయిలబుల్ నాయకులు బీహార్‌కు వెళ్లి కులతత్వాన్ని ప్రకటిస్తున్నారని విమర్శించారు. తమ శక్తినంతా ఉపయోగించి కులతత్వ విషాన్ని వ్యాప్తి చేయడానికి ప్రయత్నించారని.. కానీ ఈ బీహార్ ఎన్నికలు ఈ కులతత్వ విషాన్ని పూర్తిగా తిరస్కరించారన్నారు. ఈ ఎన్నికల్లో, విజయవంతమైన ఎన్‌డీఏ కూటమికి, ఓడిపోయిన మహా కూటమికి మధ్య 10 శాతం ఓట్ల తేడా ఉందని.. ఇది



ముఖ్యమైన విజయమన్నారు. దీని అర్థం సాధారణ ఓటర్లు ఏకగ్రీవంగా ఓటు వేశారని.. ఇది బీహార్ అభివృద్ధి పట్ల ఉన్న మక్కువను ప్రతిబింబిస్తుందన్నారు. ఎన్నికల్లో యువత, మహిళలు ప్రతిపక్ష పార్టీలకు సరైన ఇచ్చారని.. బీహార్ ప్రజలు అభివృద్ధి ఎజెండాను ఆమోదిస్తూ ప్రతిపక్షాన్ని పూర్తిగా తిరస్కరించారని.. సూరత్‌లో పనిచేస్తున్న బీహార్ ప్రజలకు ఇక్కడ పూర్తి హక్కులు ఉన్నాయన్నారు.

ఈ సందర్భంగా మోదీ వక్ఫ్ చట్టాన్ని ప్రస్తావించారు. ఇళ్లను అక్రమంగా ఆక్రమించి వక్ఫ్ ఆస్తులుగా మార్చారని.. తమిళనాడులో మొత్తం గ్రామాలను వక్ఫ్ ఆస్తులుగా మార్చారని ఆరోపించారు. అందుకే పార్లమెంటులో వక్ఫ్ చట్టాన్ని ప్రవేశపెట్టామన్నారు. బీహార్ ఎన్నికల సమయంలో ఈ హామీదారులు, వారి మిత్రులు (ప్రతిపక్షాలు) వక్ఫ్ చట్టాన్ని బహిరంగంగా చించివేశారని.. వారు అధికారంలోకి వస్తే వక్ఫ్ చట్టాన్ని అమలు చేయడానికి అనుమతి ఇవ్వమని చెప్పారని.. బీహార్ ప్రజలు కూడా ఈ మత రాజకీయాలను ఓడించారని ప్రధాని పేర్కొన్నారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను ఎవరూ రక్షించలేరన్న ప్రధాని.. ఈ దేశం ముస్లిం లీగ్-మావోయిస్ట్ కాంగ్రెస్‌ను తిరస్కరించిందన్నారు. కాంగ్రెస్ చర్యలతో దేశం అసంతృప్తిగా ఉందని.. ఇకపై కాంగ్రెస్‌ను ఎవరూ కాపాడలేరన్నారు.

### బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను పరిశీలించిన ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ(నవంబర్ 15, శనివారం) గుజరాత్‌లో పర్యటించారు. నర్మాదా దేవ్‌మోగ్రా ఆలయంలో మోదీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిర్సా ముండా జయంతి వేడుకలకు ప్రధాని హాజరయ్యారు. రూ.9,700 కోట్ల అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఉదయం సూరత్ విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని.. నిర్మాణంలో ఉన్న బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను సందర్శించి.. ముంబై-అహ్మదాబాద్ హై-స్పీడ్ రైలు కారిడార్ పురోగతిని సమీక్షించారు. ఎంఏహెచ్‌ఎస్‌ఆర్ భారతదేశం లోని అత్యంత ప్రతిష్టాత్మక మౌలిక వసతుల ప్రాజెక్టులలో ఒకటి. ఇది సుమారు 508 కి.మీ. పొడవు.

అందులో 352 కి.మీ. గుజరాత్, దాద్రా-నగర్ హవేలీలో, 156 కి.మీ. మహారాష్ట్రలో ఉంది. ఈ కారిడార్ సబర్మతి, అహ్మదాబాద్, ఆనంద్, వడోదరా, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్, థానే, ముంబై వంటి ప్రధాన నగరాలను కలుపుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక ఇంజనీరింగ్ సాంకేతికతతో నిర్మాణం జరుగుతోంది.

# ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ నామమాత్రమే

**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం ప్రకారం, 2014 నుంచి 2025 వరకు భారతదేశంలో 66 పూర్తి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.'అసెంబ్లీ ఎన్నికలు' అనే పదం ప్రధానంగా పూర్తి రాష్ట్ర ఎన్నికలకు ఉపయోగిస్తారు. బిహార్- 243 స్థానాల్లో ఎన్డీఏ 202 స్థానాల్లో ఆధిక్యంలో ఉండగా, కాంగ్రెస్ 5 స్థానాల్లో ఉంది.ఢిల్లీ- 70 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో టీడీపీ కూటమి 164 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో బీజేపీ 46 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 1 సీటు గెలుచుకుంది.ఒడిశా- 147 స్థానాల్లో బీజేపీ 78 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 14 సీట్లు గెలుచుకుంది.సిక్కిం- 32 స్థానాల్లో ఎస్‌కేఎం 19 సీట్లు, కాంగ్రెస్ ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది.హర్యానా- 90 స్థానాల్లో బీజేపీ 48 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 20 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ నేతృత్వంలోని కూటమి 230 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకుంది.జార్ఖండ్- 81 స్థానాల్లో జేఎంఎం కూటమి 47 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది.జమ్మూ కాశ్మీర్- 90 స్థానాల్లో ఎన్‌సీ 42 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మేఘాలయ- 60 స్థానాల్లో ఎన్డీఏ 31 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది. నాగాలాండ్- 60 స్థానాల్లో ఎన్డీఏ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.కర్ణాటక- 224 స్థానాల్లో కాంగ్రెస్ 135 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.మధ్యప్రదేశ్- 230 స్థానాల్లో బీజేపీ 163 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 66 సీట్లు గెలుచుకుంది. రాజస్థాన్- 200 స్థానాల్లో బీజేపీ 115 గెలుచుకోగా, కాంగ్రెస్ 69 సీట్లు గెలుచుకుంది.ఛత్తీస్‌గఢ్- 90 స్థానాల్లో బీజేపీ 54 గెలుచుకోగా, కాంగ్రెస్ 35 సీట్లు గెలుచుకుంది.తెలంగాణ- 119 స్థానాల్లో కాంగ్రెస్ 64 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.మిజోరం- 40 స్థానాల్లో జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ 27 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది. గోవా- 40 స్థానాల్లో బీజేపీ 20 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది.మణిపూర్- 60 స్థానాల్లో బీజేపీ 32 సీట్లు, కాంగ్రెస్ కేవలం 5 సీట్లు మాత్రమే గెలుచుకుంది. ఉత్తరాఖండ్- 70 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు, కాంగ్రెస్ 19 సీట్లు గెలుచుకుంది.పంజాబ్- 117 స్థానాల్లో ఆప్ 92 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 18 సీట్లు గెలుచుకుంది.ఉత్తరప్రదేశ్- 403 స్థానాల్లో బీజేపీ 255 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 62 సీట్లు గెలుచుకుంది.గుజరాత్- 182 స్థానాల్లో బీజేపీ 156 సీట్లు, కాంగ్రెస్ కేవలం 4 సీట్లు మాత్రమే గెలుచుకుంది. హిమాచల్ ప్రదేశ్- 68 స్థానాల్లో కాంగ్రెస్ 40 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.పశ్చిమ బెంగాల్- 294 స్థానాల్లో టీఎంసీ 213 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.అస్సాం- 126 స్థానాల్లో



బీజేపీ 60 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 29 సీట్లు గెలుచుకుంది.కేరళ- 140 స్థానాల్లో ఎల్‌డీఎఫ్ 99 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు గెలుచుకుంది.తమిళనాడు- 234 స్థానాల్లో డీఎంకే 133 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 3 సీట్లు మాత్రమే గెలుచుకుంది.పుదుచ్చేరి- 30 స్థానాల్లో ఎన్డీఏ 16 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 2 సీట్లు మాత్రమే గెలుచుకుంది.ఢిల్లీ- 70 స్థానాల్లో ఆప్ 62 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.బిహార్- 243 స్థానాల్లో ఎన్డీఏ 125 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 19 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. ఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో వైఎస్ఆర్-కాంగ్రెస్ 151 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు. అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో బీజేపీ 41 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది.ఒడిశా- 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 112 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 14 సీట్లు మాత్రమే గెలుచుకుంది.సిక్కిం- 32 స్థానాల్లో ఎస్‌కేఎం 17 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ 132 సీట్లు, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి.జార్ఖండ్- 81 స్థానాల్లో జేఎంఎం 30 సీట్లు, కాంగ్రెస్ 16 సీట్లు గెలుచుకున్నాయి.కర్ణాటక- 224 స్థానాల్లో బీజేపీ 104 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ 78 సీట్లు గెలుచుకుని కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.త్రిపుర- 60 స్థానాల్లో బీజేపీ 36 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 1 సీటు మాత్రమే గెలుచుకుంది.మధ్యప్రదేశ్- 230 స్థానాల్లో కాంగ్రెస్ 114 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.ఛత్తీస్‌గఢ్- 90 స్థానాల్లో కాంగ్రెస్ 60 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.రాజస్థాన్- 200 స్థానాల్లో కాంగ్రెస్ 99 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.గోవా- 40 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 13 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 17 సీట్లు గెలుచుకుంది.మణిపూర్- 60 స్థానాల్లో బీజేపీ 21 సీట్లు గెలుచుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 28 సీట్లు గెలుచుకున్నా అధికారంలోకి రాలేదు.ఉత్తరప్రదేశ్- 403 స్థానాల్లో బీజేపీ 312 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకుంది.ఉత్తరాఖండ్- 70 స్థానాల్లో బీజేపీ 57 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 11 సీట్లు గెలుచుకుంది.పంజాబ్- 117 స్థానాల్లో కాంగ్రెస్ 77 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.హిమాచల్ ప్రదేశ్- 68 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 44 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది.గుజరాత్- 182 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ 99 సీట్లు, కాంగ్రెస్ కేవలం 80 సీట్లు మాత్రమే గెలుచుకున్నాయి.2016లో అస్సాం- 126 స్థానాల్లో బీజేపీ 86 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 25 సీట్లు మాత్రమే గెలుచుకుంది.కేరళ- 140 స్థానాల్లో ఎల్‌డీఎఫ్ 91 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. తమిళనాడు- 232 స్థానాల్లో ఏఐఏడీఎంకే 136 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 8 సీట్లు మాత్రమే గెలుచుకుంది.పశ్చిమ బెంగాల్- 294 స్థానాల్లో టీఎంసీ 211 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.పుదుచ్చేరి- 30 స్థానాల్లో ఎన్డీఏ 17 సీట్లు, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకున్నాయి.2015లో 2 అసెంబ్లీ ఎన్నికలుఢిల్లీ- 70 స్థానాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 67 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.బిహార్- 243 స్థానాల్లో మహాకూటమి 178 సీట్లు గెలుచుకోగా, అప్పుడు కూడా కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.2014లో 8 అసెంబ్లీ ఎన్నికలుఆంధ్రప్రదేశ్- 175 స్థానాల్లో వైఎస్ఆర్-కాంగ్రెస్ 67 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు.అరుణాచల్ ప్రదేశ్- 60 స్థానాల్లో కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది.ఒడిశా- 147 స్థానాల్లో బీజూ జనతాదళ్ 117 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 16 సీట్లు మాత్రమే గెలుచుకుంది.సిక్కిం- 32 స్థానాల్లో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ 22 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ ఖాతా తెరవలేదు.హర్యానా- 90 స్థానాల్లో బీజేపీ 47 సీట్లు గెలుచుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, కాంగ్రెస్ 15 సీట్లు గెలుచుకుంది.మహారాష్ట్ర- 288 స్థానాల్లో బీజేపీ 122 గెలుచుకోగా, కాంగ్రెస్ 42 సీట్లు గెలుచుకుంది.జార్ఖండ్- 81 స్థానాల్లో బీజేపీ 37 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకుంది.జమ్మూ కాశ్మీర్- 87 స్థానాల్లో పీడీపీ 28 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ కేవలం 7 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది.ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ప్రకారం, గత 11 ఏళ్లలో 66 పూర్తి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ మొత్తం 8 ఎన్నికల్లో గెలిచింది. 58 ఎన్నికల్లో ఓడిపోయింది. ఇక్కడ ఓటమి అంటే మెజారిటీ రాకపోవడం లేదా కూటమికి నాయకత్వం వహించకపోవడం. ఓటు వాటా సగటున 19% ఉంది, కానీ సీట్ల మార్పిడి తగ్గింది. బీజేపీ ప్రభ, ప్రాంతీయ పార్టీల బలం, సంస్థాగత బలహీనత కాంగ్రెస్‌ను ఓడిపోయిన పార్టీగా మార్చాయి.

# పీకే ..పీకేందేమి లేదు

**పాట్నా :** ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తన సొంత జన్ సూరజ్ పార్టీతో బీహార్ ఎన్నికల్లో పోటీ చేసి ఘోరంగా విఫలమయ్యారు. గతంలో అనేక పార్టీలకు విజయం అందించిన పీకే, ఈ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోగా, కనీసం ఆధిక్యం కూడా కనబరచలేకపోయారు. అనేక పార్టీలకు విజయం అందించిన ప్రశాంత్ కిషోర్ సొంత రాజకీయ ప్రస్థానం నిరాశపరిచింది. జన సూరజ్ పార్టీకి కనీసం ఒక్క ఆధిక్యం కూడా లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.అందరికీ శకునం చెప్పే బల్లి కుడితిలో పడి చచ్చింది అనే సామెత మాదిరి తయారైంది జన సూరజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ పరిస్థితి. గత రెండు దశాబ్దాలుగా అనేక పార్టీలకు ఎలక్షన్ స్ట్రాటజిస్టుగా పని చేసి, పార్టీల భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చేలా ప్రణాళికలు రచించారు ప్రశాంత్ కిషోర్. ఇక తాను స్వయంగా రాజకీయాల్లోకి దిగి జన సూరజ్ పార్టీ స్థాపించి, సొంత రాష్ట్రం బీహార్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి దిగారు. అయితే అనూహ్యంగా ఈ ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవకపోగా కనీసం ఆధిక్యాన్ని కూడా కనబరచలేకపోతోంది. మొత్తం 243 స్థానాల్లో ప్రశాంత్ కిషోర్ సహా.. ఏ ఒక్క చోట కూడా జన సూరజ్ పార్టీ ఓట్లు సాధించలేకపోయింది. అందరికీ స్ట్రాటజీలు ప్లే చేసే పీకే తన విషయం వచ్చేసరికి చతికిలా పడిపోయాడు పాపం అంటున్నారు రాజకీయ విమర్శకులు.బీహార్ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత్ కిషోర్ కు రాజకీయ విపత్తుగా మారాయి. ఆయన పార్టీ జన్ సూరజ్ పార్టీ ఒకప్పుడు గేమ్-ఛేంజర్ గా, త్రిముఖ పోటీలో పోటీదారుగా ప్రశంసలు అందుకుంది. కానీ ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది. బీహార్ లోని 243 స్థానాల్లో పికె పార్టీ ఏ ఒక్కదానిలోనూ ఆధిక్యంలో లేదు. ఆయన అభ్యర్థులందరూ పేలవమైన స్థితిలో ఉన్నారు. బీహార్ రాజధాని పాట్నాలోని కుమ్రార్ నియోజకవర్గం విజయం కోసం అత్యంత గట్టిగా ఎదురుచూస్తున్న అభ్యర్థి, కానీ అక్కడ కూడా పీకే పార్టీ మూడవ స్థానంలో వెనుకబడి ఉంది. టీవీ ఛానెళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో, అనేక బహిరంగ సభలలో, ప్రశాంత్ కిషోర్.. "ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడదని రాతపూర్వకంగా రాసుకోండి. నవంబర్ తర్వాత నితీష్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదవి నుంచి తప్పుకుంటారు. కొత్త ముఖ్యమంత్రి నియమితులవుతారు" అని ఆయన అన్నారు. తన అంచనాలు విఫలమైతే తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని ఖఐ రెండుసార్లు అన్నారు. జన్ సూరజ్ గెలిచినా, జేడీయూ గురించి తన అంచనాలు నిజం కాకపోయినా, తాను రాజకీయాల నుండి తప్పుకుంటానని కూడా ఆయన స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం తిరిగి అధికారంలోకి రావడమే కాకుండా, గతసారి కంటే మెరుగ్గా తీరు కనబరుస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే 200 సీట్ల మార్క్ దాటేసింది. ఒక్క జెడియు 80 సీట్లు గెలుచుకుంటుందని ట్రెండ్స్ సూచిస్తున్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఖాతాను కూడా తెరవలేదు.జన్ సూరజ్ పార్టీ ఏర్పాటు చేయడానికి ముందు ప్రశాంత్ కిషోర్ మే 5, 2022 నుండి అక్టోబర్ 2, 2024 వరకు 6,000 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఆయన 5,000 గ్రామాలకు చేరుకుని 5,000 సమావేశాలు నిర్వహించారు. బీహార్ అంతటా తిరుగుతూ గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన మే 2022 నుండి 1,280 రోజుల పాటు బీహార్ మొత్తాన్ని గాలించినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రశాంత్ కిషోర్ తన ఎన్నికల ప్రచారాన్ని రోడ్డు మార్గంలోనే నిర్వహించారు. అక్టోబర్ 21 నుండి ప్రతిరోజూ సగటున 200 కి.మీ. ప్రయాణించానని పీకే చెప్పారు.

## ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరం



ఎస్ఐఆర్ అంశంలో ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రజలలో గందరగోళం నెలకొందని టీవీకే అధినేత, ప్రముఖ నటుడు విజయ్ అన్నారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఒక వీడియోను విడుదల చేశారు. ప్రజలు, ముఖ్యంగా జెన్-జెడ్ ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్ తర్వాత నవీకరించబడిన ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగం ఇచ్చిన అతి ముఖ్యమైన హక్కులలో ఓటు హక్కు ఒకటని విజయ్ పేర్కొన్నారు. ఈ దేశ పౌరుడిగా జీవించేందుకు ఓటు హక్కు చాలా అవసరమని అన్నారు. ఓటు హక్కు లేకపోతే మన ప్రజాస్వామ్యం అసంపూర్ణమే అని ఆయన అభిప్రాయపడ్డారు. ఎస్ఐఆర్ నేపథ్యంలో చాలామంది తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ ప్రచురించే ఓటరు జాబితాలో మన పేర్లు కనిపిస్తేనే ఓటు వేయగలమని గుర్తుంచుకోవాలని సూచించారు. తమిళనాడులో 6.36 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, కానీ ఎస్ఐఆర్ ప్రక్రియను నెలలోపు ఎలా పూర్తి చేయగలుగుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటి వరకు తమ పార్టీకి చెందిన చాలామందికి ఫారమ్‌లు అందలేదని అన్నారు. అందుకే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. భౌతిక ఫారమ్ అందుకోలేని వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్పుడే ఓటరు జాబితాలో మన పేరు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. యువత ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరగవచ్చని ఆయన హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో జెన్ జెడ్ ఓటర్లు నిర్ణయాత్మక పాత్రను పోషిస్తారని, అందుకే వారికి జాబితాలో చోటు లేకుండా ప్రయత్నాలు చేయవచ్చని అన్నారు. ఓటు అనేది అత్యంత శక్తిమంతమైన ప్రజాస్వామ్య సాధనమని గుర్తుంచుకోవాలని ఆయన ఉద్బోధించారు. మన ఓటు మన ప్రజాస్వామ్య ఆయుధమని పేర్కొన్నారు. "జెన్ జెడ్ ఒక శక్తి. వారు అప్రమత్తంగా ఉండాలి. అంతా మంచి జరుగుతుంది. విజయం ఖాయం" అని విజయ్ తన వీడియోను ముగించారు.


## ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు.. బీజేపీ, జేడీ(యూ)కి దక్కిన సీట్లు



**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘటబంధన్ కూటమికి నేతృత్వం వహించిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)కే ఎక్కువ ఓట్లు పోల్ అయ్యాయి. అయితే ఎన్డీయే కూటమికి చెందిన బీజేపీ, జేడీ(యూ)కు అత్యధిక సీట్లు దక్కాయి. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకుగాను ఎన్డీఏ కూటమి 202 స్థానాలు గెలుచుకున్నది. చెరో 101 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 89 సీట్లు, నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) 85 సీట్లు గెలుచుకున్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 19 సీట్లు, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) 5 సీట్లు, రాజ్యసభ ఎంపీ ఉపేంద్ర కుష్వాహా నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా 4 సీట్లలో విజయం సాధించాయి.

కాగా, మహాఘటబంధన్ కూటమికి నేతృత్వం వహించిన ఆర్జేడీ 144 స్థానాల్లో పోటీ చేసింది. అయితే 25 సీట్లలో మాత్రమే విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ 61 సీట్లలో పోటీ చేయగా కేవలం 6 స్థానాల్లో గెలుపొందింది. సీపీఐ(ఎంఎల్) రెండు సీట్లు, సీపీఐ(ఎం) ఒక సీటు దక్కించుకోగా సీపీఐ ఏదీ గెలుచుకోలేదు. దీంతో మహాఘటబంధన్ కూటమి 35 సీట్లకే పరిమితమైంది. మరోవైపు ఓటు శాతాన్ని పరిశీలిస్తే బీహార్ ప్రజలు ఆర్జేడీకే ఎక్కువ ఓట్లు వేశారు. ఆ పార్టీ 23 శాతం ఓట్లు సాధించింది. అయితే గత ఎన్నికల్లో 23.11 శాతం ఉండగా ఈసారి స్వల్పంగా తగ్గింది. 144 స్థానాల్లో పోటీ చేసిన ఆర్జేడీకి మొత్తం 1,15,46,055 ఓట్లు పోలయ్యాయి. అయితే కేవలం 25 సీట్లలోనే ఆ పార్టీ విజయం సాధించింది. సుమారు 42 సీట్లు స్వల్ప ఓట్ల తేడాతో కోల్పోయింది. కాగా, బీజేపీ ఓట్ల శాతం ఈసారి మరింత పెరిగింది. 2020 ఎన్నికల్లో 19.46 శాతం ఉండగా ఈసారి 20.07 శాతానికి పెరిగింది. గత ఎన్నికల్లో 110 నియోజకవర్గాల్లో పోటీ చేసిన బీజేపీ ఈ ఎన్నికల్లో 101 సీట్లకే పరిమితమైంది. అయినప్పటికీ 1,00,81,143 మంది ఓటర్లు బీజేపీకి ఓటు వేశారు. జేడీ(యూ)కు 19.25 శాతం ఓట్లు పోలయ్యాయి.

## నౌగామ్‌లో పేలుడు ఉగ్రకుట్ర కాదు.. ప్రమాదమే



జమ్ము కశ్మీర్‌లోని నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో సంభవించిన భారీ పేలుడులో 9 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ పేలుడు వెనుక ఉగ్రవాద కుట్ర ఉందన్న ప్రచారంపై రాష్ట్ర డీజీపీ నళిన్ ప్రభాత్ స్పందించారు. ఉగ్రవాద కుట్ర ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని ఆయన వెల్లడించారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను ఛేదించిన అధికారులు, అక్కడి నుంచి పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి నుంచి నమూనాలు (శాంపిల్స్) సేకరిస్తుండగా భారీ విస్ఫోటనం జరిగింది. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని భావించినప్పటికీ, జైషేకు అనుబంధ సంస్థ అయిన పీపుల్స్ యాంటీ ఫాసిస్ట్ ఫోర్స్ ఈ దాడి తమ పనేనని ప్రకటించింది. అయితే డీజీపీ దీనిని ఖండించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన అని స్పష్టం చేశారు. డీజీపీ మీడియాతో మాట్లాడుతూ, ఫరీదాబాద్ నుంచి స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించేందుకు సిద్ధం చేశామన్నారు. ఫోరెన్సిక్ సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ, దురదృష్టవశాత్తు పేలుడు సంభవించిందని తెలిపారు. మృతి చెందిన తొమ్మిది మందిలో ముగ్గురు ఫోరెన్సిక్ సిబ్బంది, రాష్ట్ర వైద్య సంస్థకు చెందిన ఒకరు, ఇద్దరు క్రైమ్ ఫొటోగ్రాఫర్లు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ఒక టైలర్ ఉన్నారని ఆయన పేర్కొన్నారు. 32 మంది గాయపడగా, వారికి చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్ పూర్తిగా దెబ్బతిన్నదని, సమీపంలోని భవనాలు కూడా ప్రభావితమయ్యాయని ఆయన తెలిపారు. నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన పేలుడుపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని, 27 మంది పోలీసులు, ఇద్దరు రెవెన్యూ అధికారులు, ముగ్గురు పౌరులు గాయపడ్డారని పేర్కొంది. నౌగామ్ పేలుడుపై మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (జమ్ము కశ్మీర్ డివిజన్) ప్రశాంత్ లోఖండే మాట్లాడుతూ, పేలుడు కారణంగా పోలీస్ స్టేషన్ భవనంతో పాటు చుట్టుపక్కల ఉన్న కొన్ని నిర్మాణాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి పెండ్యాల రమాదేవి





**పోలవరం ప్రతినిధి(శుభోదయం న్యూస్):**
కొయ్యలగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని తాసిల్దార్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన వ్యవసాయ శాఖ అధికారి పోసారావు మండల నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ పెండ్యాల రమాదేవి మాట్లాడుతూ దళారుల వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న దాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు న్యాయం చేకూర్చుతాయని అన్నారు. కేంద్రం ద్వారా దళారులు లేక మధ్య వర్తులు మిల్లర్ల చేతిలో రైతన్నలు నష్టపోకుండా ఇటువంటి మోసాలకు తావు లేకుండా ఉంటుందని, ధాన్యం విక్రయించిన రైతులకు వారి ఆధార అనుషిత బ్యాంక్ ఖాతాలో డబ్బులు నేరుగా వారి ఖాతాలో జమ చేయడం జరుగు తుందన్నారు. ఈ కేంద్రాలు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు పనిచేస్తాయని పెండ్యాల రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు జనసేన పట్టణ అధ్యక్షులు మాదేపల్లి శ్రీను, గంగిరెడ్ల మేఘమాదేవి, ఆరేటి వీరపండు, గుడిమెట్ల శేషారావు. బాలగంగాధర్ తిలక్, మట్టా శ్రీను, నక్క బావి, ఏపూరి సతీష్, కర్రీ రాంబాబు, రామకృష్ణారాజు, ముత్యాల చిన్న, కొయ్యలగూడెం సొసైటీ సిబ్బంది మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఓటమికి 5 కారణాలు!




**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పే ఉపఎన్నికగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాన్ని అందరూ భావించారు. రెండేళ్ల కాంగ్రెస్ సర్కార్ పాలనపై ఓ పరీక్షగా ఈ ఉపఎన్నికను భావిస్తే, రాజకీయంగా కోల్పోయిన ప్రాభవాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్‌కు మంచి అవకాశంగా మరో పరీక్షగా విశ్లేషణలు జరిగాయి. కానీ, జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక ఫలితం మాత్రం బీఆర్ఎస్‌కు మరో చేదు అనుభవాన్ని మిగిల్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన రెండో ఉపఎన్నికలో కూడా తన సిట్టింగ్ స్థానాన్ని గులాబీ పార్టీ కోల్పోయింది. అయితే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఐదు ప్రధాన కారణాలు ప్రముఖంగా చెప్పవచ్చు. ఈ కథనం పూర్తిగా చదివితే ఆ ఐదు కారణాలేంటో స్పష్టంగా అర్థమవుతాయి.

**1. అధికార పార్టీ పాలనకు రెఫరెండం**

ఈ ఉపఎన్నిక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జరిగిన రెండో ఉపఎన్నిక. 2024 లో కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణంతో వచ్చిన ఉపఎన్నికలో ఆమె సోదరి నివేదిత బరిలో నిలిచింది. అయితే అప్పటికే అధికారంలోకి వచ్చిన ఊపులో హస్తం పార్టీ కంటోన్మెంట్ స్థానాన్ని హస్తగతం చేసింది. ఆ తర్వాత జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఆయన సతీమణి మాగంటి సునీత కారు పార్టీ అభ్యర్థిగా ఉపఎన్నికలో పోటీ చేసింది. అయితే రిజల్ట్ సేమ్. కంటోన్మెంట్ ఉపఎన్నిక ఫలితమే జూబ్లీ హిల్స్‌లో పునరావృతమైంది. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత వచ్చిన ఉపఎన్నిక ఇది. కాంగ్రెస్ పాలనకు ఇది ప్రజాతీర్పు లాంటిది. ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉందని, అది ఈ ఉపఎన్నిక ద్వారా బయటపడుతుందని బీఆర్ఎస్ నేతలు భావించారు. 'ఆరు గ్యారంటీలు' అమలు కావడం లేదని ఇది జూబ్లీహిల్స్ ఓటరు తీర్పు ద్వారా బహిర్గతం అవుతుందని భావించారు. కానీ, కాంగ్రెస్ పార్టీపై జూబ్లీ ఓటర్లు సానుకూలంగా ఉన్నట్లు ఈ ఫలితం తేల్చి చెప్పింది. అభివృద్ధి, సంక్షేమం, 'ఆరు గ్యారంటీలు' అమలు చేసే పాలన తీరుకు ఓటర్లు సానుకూలంగా తీర్పు ఇచ్చినట్లు అర్థమవుతోంది. తాము ఏం చేస్తున్నారో సీఎం రేవంత్ రెడ్డితోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ క్యాడర్ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సఫలం అయ్యారు. దానికి నిదర్శనమే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకుంది. అయితే ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడంలో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైంది.

**2.ఎం.ఐ.ఎం. మద్దతుతో మైనారిటీ ఓట్ల ఏకీకరణ**

జూబ్లీహిల్స్‌లో మైనారిటీ ఓటర్లు విజయాన్ని ప్రభావితం చేసే కీలక అంశం. ఈ నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లు సుమారు 1.4 లక్షలు ఉన్నాయి. అయితే ఈ ఓట్లను తమ వైపు తిప్పుకోవడంలో బీఆర్ఎస్ విఫలమైంది. పాత మిత్రపక్షం అయిన ఎం.ఐ.ఎం. కాంగ్రెస్‌తో జట్టు కట్టడంతో బీఆర్ఎస్‌కు గతంలో పడిన మైనారిటీ ఓట్లకు గండిపడింది. ఎం.ఐ.ఎం. ఈ ఉపఎన్నికలో పోటీ చేయకుండా కాంగ్రెస్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించింది. అదే రీతిలో మైనారిటీ ఓట్లను ఆకట్టుకునేందుకు మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవిని హస్తం పార్టీ కట్టబెట్టింది. దీంతో మైనారిటీ ఓట్లను కాంగ్రెస్ దక్కించుకోవడంలో సక్సెస్ అయింది. దీంతో గులాబీ పార్టీకి మైనారిటీ వర్గం ఈ ఎన్నికలో మొండి చేయి చూపడంతో సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడానికి ముఖ్య కారణంగా మారింది.

**3. పనిచేయని మాగంటి 'సానుభూతి' అస్త్రం, కుటుంబ వివాదాలు**

మూడు సార్లు ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతను బీఆర్ఎస్ తన అభ్యర్థిగా నిలబెట్టింది. సానుభూతి ఓట్లు పడి సులభంగా గెలుస్తుందన్నది బీఆర్ఎస్ పార్టీ వ్యూహం. కానీ, ఇది బెడిసికొట్టింది. మాగంటి గోపీనాథ్ సేవలు, సునీతపై సానుభూతి అంశాన్ని జూబ్లీహిల్స్ ఓటర్లు పెద్దగా పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో పాటు ఎన్నికల సమయంలోనే మాగంటి సునీత కుటుంబ గొడవలు రచ్చకు దారి తీశాయి. మాగంటి గోపీనాథ్ మొదటి భార్య,, తల్లి జోక్యం చేసుకోవడం వల్ల అప్పటి వరకు ఎంతో కొంత ఉన్న సానుభూతి ఓటు కూడా చీలిపోయింది. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీకి 'ప్లాన్ బి' లేకుండా పోయింది. దీంతో అనుకున్న రీతిలో సానుభూతి ఓట్లను బీఆర్ఎస్ దక్కించుకోవడంలో పూర్తిగా విఫలమైంది.

**4. ప్రచారంలో కానరాని అగ్రనాయకత్వం**

ఓ వైపు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి కాలికి బలం కట్టుకొని ప్రచారం చేస్తుంటే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాత్రం ప్రచారానికి పూర్తిగా దూరంగా ఉన్నారు. అంతేకాకుండా, సీఎం హోదాలో ఇంతగా ప్రచారం చేయాలా అంటూ ఆ పార్టీ ముఖ్య నేతలు ఎద్దేవా చేశారు. తమ విజయం నల్లేరుపై నడకే అన్నట్లుగా ఃఖీూ ముఖ్య నేతలు ఉదాసీనంగా వ్యవహరించారు. తన పాలనపై తానే స్వయంగా ప్రజలను ఒప్పించడానికి సీఎం రేవంత్ ప్రయత్నిస్తుంటే, దానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ నుంచి సరైన రీతిలో కౌంటర్ అటాక్ చేయడంలో విఫలమైంది. ఇక పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీశ్ రావు కీలకమైన సమయంలో తండ్రి మరణంతో ప్రచారంలో పూర్తిగా నిమగ్నం కాలేకపోయారు. దీంతో కేటీఆర్ ఒక్కడిపైనే అధిక భారం పడింది. మరోవైపు కాంగ్రెస్ మంత్రులు, ముఖ్య నేతలు డివిజన్ల వారీగా ప్రచారంలోనూ, కాంగ్రెస్ వ్యూహాల అమలులో కీలకంగా వ్యవహరిస్తే, అదే స్థాయిలో బీఆర్ఎస్ నేతల భాగస్వామ్యం కొరవడింది. ఈ అంశం కూడా బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణంగా మారింది.

**5. బీఆర్ఎస్ సెటిలర్ ఓటర్లకు గండి కొట్టిన కాంగ్రెస్**

జీహెచ్ఎంసీ పరిధిలో గులాబీ పార్టీ వికసించడానికి కీలకమైన 'సెటిలర్ల' ఓట్లను ఈ దఫా హస్తం పార్టీ హస్తగతం చేసుకుంది. నియోజకవర్గంలోని కమ్మ సామాజిక వర్గం ఓట్లు, ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన 'సెటిలర్ల' ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయితే బీఆర్ఎస్‌కు పడకుండా కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పోల్ మేనేజ్‌మెంట్ చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆయా వర్గాల వారితో సమావేశాలు నిర్వహించడం వంటివి ఫలితానిచ్చాయి. మరోవైపు 'సెటిలర్లు' కూడా అధికారంలో ఉన్న పార్టీతోనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న ధోరణి కూడా బీఆర్ఎస్ పార్టీకి చేటు చేసింది. ఈ అంశంపై బీఆర్ఎస్ కీలక నేతలు దృష్టి సారించకపోవడం కూడా ఆ పార్టీ ఓటమికి ప్రధాన కారణంగా మారింది. ఈ కారణాలన్నీ మిళితమై చివరకు సిట్టింగ్ స్థానాన్ని బీఆర్ఎస్ కోల్పోవడానికి దారి తీసింది. అయితే ఈ ఉపఎన్నిక ఫలితం తర్వాత 'కారు' జోరు పెంచడానికి పార్టీ అధినేత కేసీఆర్ ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

# జూబ్లీహిల్స్ ఫలితంతో కాంగ్రెస్‌లో నయా జోష్

**జూబ్లీహిల్స్ ఫలితంతో మంత్రి పొన్నం కు ప్రమోషన్ !**

**పార్టీ బాధ్యతలు అప్పగిస్తారని గుసగుసలు**

**కాంగ్రెస్ నేతల తలరాతలు మార్చనున్న జూబ్లీహిల్స్ ఫలితం**

జూబ్లీహిల్స్ : ఫలితం కాంగ్రెస్ నేతల తలరాతలు మార్చనుందా... కాంగ్రెస్ గెలుపు పలు సమస్యలకు పరిష్కారం చూపనుందా.... ఉప ఎన్నికలో కర్త కర్మ క్రియగా వ్యవహరించిన వారికి ప్రమోషన్లు లభించనున్నాయా... అంటే ఔననే సమాధానం వస్తుంది. హైదరాబాద్ ఇన్చార్జ్ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ రథసారథి మహేష్ గౌడ్ కు ప్రమోషన్ లభిస్తుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీలో, ప్రభుత్వంలో సమూల మార్పులకు నాంది కాబోతుందనే ప్రచారం జరుగుతుంది. ఒక్క ఫలితంతో సమస్యలన్నింటికి పరిష్కారం దొరకనుందా... నాడు వైఎస్సార్ ఎమ్మెస్సార్ జోడి మాదిరిగా నేడు రేవంత్ పొన్నం జోడి కుదిరేనా?. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితం కాంగ్రెస్ లో నయా జోష్ నింపింది. పార్టీ శ్రేణులను సంబరాల్లో ముంచెత్తింది. జూబ్లీహిల్స్ ఓటర్లు చెయ్యెత్తి జై కొట్టడం బాగానే ఉన్నా కాంగ్రెస్ లో ఉప ఎన్నిక ఫలితం పార్టీలో సమూల మార్పులకు నాంది పలకబోతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ లో సెంటర్ అట్రాక్షన్ గా నిలిచిన హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రమోషన్ లభిస్తుందనే ప్రచారం జరుగుతుంది. మంత్రి పదవి నుంచి తప్పించి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రథసారథిగా నియమించనున్నారనే టాక్ మొదలైంది. ఉప ఎన్నికలో అన్నితామై వ్యవహరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌లకు ప్రమోషన్ లభిస్తుందనే ప్రచారం సాగుతుంది. పార్టీలో ప్రభుత్వంలో మార్పులు చేర్పులు స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ఉంటాయా, వాటికంటే ముందుగానే ఉంటాయా అనే విషయంపై స్పష్టత లేనప్పటికీ సమూల మార్పులకు పార్టీ పెద్దలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఉప ఎన్నిక ఫలితంతో ఫుల్ జోష్ లో ఉన్న కాంగ్రెస్, స్థానిక సంస్థల ఎన్నికలను డిసెంబర్ లోగా నిర్వహించి సత్తా చాటే పనిలో నిమగ్నమయింది. అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో పార్టీ పెద్దలు నిమగ్నమయ్యారట. 17న జరిగే క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుని 2026 లో పార్టీలో ప్రభుత్వంలో సమూల మార్పులు చేస్తారనే చర్చ పార్టీ శ్రేణుల్లో మొదలయింది. ఊహాగానాలు పార్టీ శ్రేణుల గుసగుసలు ఎటువైపు దారి తీస్తాయోనని ఆసక్తికరమైన చర్చ సాగుతుంది.

## న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**హైదరాబాద్ :** కాంగ్రెస్ మ్యానిఫెస్టో హామీ మేరకు రాష్ట్రం లోని అర్హులైన న్యాయవాదులనీదరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని హై కోర్ట్ సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి ఆన్ లైన్ ద్వారా వినతి పత్రం పంపించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోని వివిధ కోర్టుల్లో 40 వేల మంది న్యాయవాదులు తమ సేవలు అందిస్తున్నారని వివరించారు. అందులో 10 వేల మంది పేద లాయర్లు ఇళ్లు లేక.అద్దెలు చెల్లించలేక నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాజేంద్ర నగర్ లో నూతనంగా చేపడుతున్న హైకోర్టు సమీపంలో ప్రభుత్వం 30 ఎకరాల స్థలం కేటాయించి అపార్టుమెంట్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు అంతేకాకుండా తెలంగాణ ఆద్వకెట్ వెల్ఫేర్ ఫండ్ ను అందించి ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశం లో న్యాయవాదులు గంగా వత్ నవీన్.ఇరుకు మహేందర్ పాల్గొన్నారు.

## ట్రాన్స్ జెండార్‌పై లైంగిక దాడి

**హైదరాబాద్ :** హబీబ్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాన్జెండర్పై దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆన్లైన్ డేటింగ్ యాప్ ద్వారా పిలిపించుకొని, నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి దాడికి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు రియాన్, అఫ్ఫాన్ ఏ జాఫర్, అహ్మద్ లు బాధితుడిని నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లి అసభ్య ప్రవర్తనతో పాటు ?30,000 ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో ముగ్గురు వ్యక్తులు ట్రాన్జెండర్పై దాడి చేయగా, బాధితుడికి గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు.
ఈ ఘటనపై ట్రాన్జెండర్ చేసిన ఫిర్యాదు మేరకు హబీబ్నగర్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. దర్యాప్తు లో భాగంగా ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

## అశోక హోటల్‌లో కేక్ మిక్సింగ్ ఫెస్ట్

**హైదరాబాద్ :** క్రిస్మస్ వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. హైదరాబాద్ లకిడికపుల్ లోని అశోక హోటల్ లో కేక్ మిక్సింగ్ ఫెస్ట్ తో క్రిస్మస్ సంబరాలు ప్రారంభించారు. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, దేశీయ మద్యంతో పాటు ఖరీదైన వైన్ పోసి హోటల్ సిబ్బంది తో కలిసి ఎండి డాక్టర్ తేజస్విని రెడ్డి కేక్ మిక్సింగ్ చేశారు. ఈ సందర్భంగా హోటల్ సిబ్బంది ఉల్లాసంగా ఉత్సాహంగా పోటీపడి కేక్ మిక్స్ చేశారు. ఈ కేక్ మిక్సింగ్ను డిసెంబర్ రెండో వారం వరకు నానబెట్టి సోక్ చేసి చివరగా కేక్ తయారీని ప్రారంభిస్తామని హోటల్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జావేద్ తెలిపారు. ప్రత్యేకమైన మసాలాలు లవంగాలు ఇలాచీ పౌడర్ను అందులో వేసి ఆల్కహాల్ తో కలిపి మిశ్రమాన్ని తయారు చేస్తామని తెలిపారు. నెలరోజులపాటు వేడిగా ఉండే ప్రదేశంలో ఈ మిశ్రమాన్ని ఉంచి కేకులు తయారు చేసి క్రిస్మస్ , న్యూ ఇయర్ సంబరాలు జరుపుతామని పేర్కొన్నారు. కేక్ మిక్సింగ్ చేయడం తమకు ఎంతో సంతోషంగా ఉందని... హోటల్లో ఉన్న సిబ్బంది మరియు యాజమాన్యం బంధాన్ని మరింత దృఢంగా చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. గత కొన్ని ఏళ్లుగా ఈ కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు స్పష్టం చేశారు.

## పాన్గల్ అంగన్వాడి సెంటర్‌లో ఘనంగా బాలల దినోత్సవం

**వనపర్తి :** పానగల్ మండల కేంద్రంలో అంగన్వాడి సెంటర్లో బాలల దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవిందరాజులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14 భారత తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారు, ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం కాబట్టి ఎక్కువ సేపు పిల్లలతోనే గడిపేవాడు.జవహర్‌లాల్ నెహ్రూను పిల్లలు ఆప్యాయంగా చాచా నెహ్రూ ("అంకుల్ నెహ్రూ") అని పిలిచేవారు , మరియు ఆయనపై వారి విశ్వాసం ఆయనకు నిరంతరం ఆనందాన్ని కలిగించేది అని పేర్కొన్నారు. ప్రధానమంత్రిగా, నెహ్రూ "దేశంలో పిల్లలు మరియు వారి సంక్షేమంపై నిరంతరం దృష్టి కేంద్రీకరించబడే వాతావరణాన్ని సృష్టించాలని" కోరుకున్నారు.. ఐసిడిఎస్ సూపర్వైజర్ షాహిన్ బేగం మాట్లాడుతూ 1958లో ఒక ఇంటర్వ్యూలో రామ్ నారాయణ్ చౌదరి అడిగినప్పుడు , దేశ భవిష్యత్తు పిల్లలపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ఆయన పిల్లలపై ప్రేమ కలిగి ఉన్నారా అని అడిగినప్పుడు, నెహ్రూ ఇలా సమాధానమిచ్చారు, "నేటి పిల్లలు రేపటి భారతదేశాన్ని తయారు చేస్తారని నేను ఎప్పుడూ భావించాను మరియు మనం వారిని పెంచే విధానం దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోఆర్డీఎస్ ఏ టు జె సోషల్ మొబిలైజర్ ఏ రాజశేఖర్ మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా 100 డేస్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతిజ్ఞ నిర్వహించే పోస్టర్లు రిలీజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాన్గల్ పంచాయతీ కార్యదర్శి నరేష్ గౌడ్, అంగన్వాడి టీచర్స్ మాధవి, జిలే కాబి,తిరుపతమ్మ, ఆయా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనిషి పేదల డాక్టర్

**సోషలిస్ట్ అభ్యుదయ భావాలు కలిగిన అపర మేధావి డాక్టర్ బాలకిష్టయ్య.**




**వనపర్తి :** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిడాక్టర్ బాలకిష్టయ్య శతజయంతి సందర్భంగా శనివారం ఉదయం తెలంగాణ మాజీ వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు డాక్టర్ బాలకిష్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్.బాలకిష్టయ్య తన జీవితకాలం పేదల పక్షాన నిలబడి సేవలు అందించిన మహోన్నత శక్తి అని సోషలిస్ట్ అభ్యుదయ భావాలు కలిగి కాంగ్రెస్ వ్యతిరేఖ రాజకీయాలు చేశారని అన్నారు. ప్రజలందరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ వారి ఉన్నతికి, అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. స్వాతంత్ర సమరయోధుడుగా, సంఘసంస్కర్తగా సామాజిక న్యాయం,విద్యాపర్తిగా వనపర్తిని అభివృద్ధి చేశారని కొనియాడారు. ప్రజా డాక్టరుగా కొనసాగుతూ పట్టణ అభివృద్ధి సంస్థ స్థాపించి ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చి సర్పంచిగా, మున్సిపల్ చైర్మన్ గా పట్టణాన్నికి మంచినీటి సౌకర్యం,మౌలిక వసతులు,ఎందరికో ఉద్యోగాలు కల్పించి వనపర్తి పితామహునిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే గా మండలానికి జూనియర్ కళాశాల మరియు మహిళా జూనియర్ కళాశాల,డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడ్పడ్డారని మాజీ మంత్రి అన్నారు. కుటుంబ సభ్యులు డాక్టర్.భూపేష్,మాజీ ఐ.ఏ. యస్ దినకర్,మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రమిలమ్మ,మాజీ సర్పంచ్ జయంతి,సంజీవ్ ముదిరాజ్, సంజయ్, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ గట్టు యాదవ్, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, వనపర్తి పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, వనపర్తి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్ , బాల్ రామ్ సార్,వేణు రెడ్డి, స్వరాజ్యం సార్,వీరయ్య సార్,కృష్ణయ్య సార్,అమర్నాథ్,శంకర్ గౌడ్,బైరోజు.చంద్రశేఖర్,మాజీ జెడ్.పి.టి. సి రఘుపతి రెడ్డి, మాజీ వనపర్తి మున్సిపల్ కౌన్సిలర్స్ కాగితాల.లక్ష్మీనారాయణ,బండారు.కృష్ణ,నాగన్న యాదవ్,ఉంగ్లం. తిరుమల్,ప్రేమ్ నాథ్ రెడ్డి, ఇమ్రాన్,కె.మాణిక్యం,జాత్రు నాయక్, జోహెబ్ హుస్సేన్,చిట్యాల.రాము,మంద రాము తదితరులు పాల్గొన్నారు.

# కారంపూడి మండలంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం పరిశుభ్రతపై అవగాహన

కారంపూడి, జర్నలిస్ట్ ఆర్కే
(శుభోదయం న్యూస్):



ప్రతినెల నిర్వహించే స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం లో భాగంగా శనివారం కారంపూడి మండల పరిధిలో పరిశుభ్రత ప్రచారం, శుభ్రత కార్యక్రమాలు, స్వచ్ఛ ప్రతిజ్ఞలు చేపట్టారు. ప్రభుత్వం సూచించిన "వ్యక్తిగత మరియు సమాజ పరిశుభ్రత" అంశంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించారు.గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, చేతులు సరైన విధంగా కడుక్కోవడం వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల్లో, పంచాయతీల్లో, గ్రామ సభల్లో ప్రజలకు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు.

**నాగులేరు మెట్ల వద్ద శుభ్రత కార్యక్రమం**

స్థానిక వీరులదేవాలయం వద్ద ఉన్న నాగులేరు మెట్లను పారిశుధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మల్లయ్య, మలేరియా సూపర్వైజర్ లాలు నాయక్ తదితరులు శుభ్రపరిచారు. చెత్త తొలగింపు, చెదురుమదురు కూల్చివేత, నీటి నిల్వలు లేకుండా చూడటం వంటి చర్యలు చేపట్టారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు రమ్య, మౌనిక, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొని స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య మాట్లాడుతూ"ప్రతి ఒక్కరు వ్యక్తిగతంగా పరిశుభ్రత పాటించాలి. చేతులను తరచూ సబ్బుతో కడుక్కోవాలి. వ్యక్తిగత మరుగుదొడ్లు వాడాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే రోగాలు దూరం అవుతాయి" అని సూచించారు. మండలంలోని అన్ని పంచాయతీలలో సర్పంచులు, కార్యదర్శులు, పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులు స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామాల వారీగా శుభ్రత కార్యక్రమాలు, అవగాహన సభలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బిజెపి నాయకులు కరిబండి నాగరాజు కుటుంబాన్ని పరామర్శించిన - ఎమ్మెల్యే

పోలవరం ప్రతినిధి(శుభోదయం న్యూస్):



పోలవరం మండలం గుటాలలో నివసిస్తున్న బీజేపీ నాయకుడు కరిబండి నాగరాజు తండ్రి కరిబండి వెంకటేశ్వరరావు ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో పోలవరం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వారి నివాసానికి వెళ్ళి మృతునికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఏ విధమైన సహాయం కావాలన్నా ప్రభుత్వం అండగా ఉంటుందని, నేను ఎల్లప్పుడూ మీ కుటుంబానికి తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, గ్రీన్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బోరగం వెంకటలక్ష్మి, నాయకులు చాట్రాతి ప్రసాద్, కొండపల్లి ప్రసాద్, వాడపల్లి లక్ష్మణాచారి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా పై బైండోవర్ కేసులు

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్
(శుభోదయం న్యూస్):



డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ్ ,ఏలూరు శ్రీమతి. బి.శ్రీలత , అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రోహిబిషన్ ఎక్సైజ ఏలూరు శ్రీ. ఏ.ఆవులయ్య వారి ఆదేశాలు ప్రకారము చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని లింగపాలెం మండలం వేములపల్లి గ్రామంలో గల పాత నాటు సారాయి ముద్దాయిలు అయినా కంభం కృష్ణ మరియు దంపనబోయిన నరసింహం అను వ్యక్తులను లింగపాలెం మండల తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి 129 బి బి ఎన్ ఎస్ ఎస్ బైండోవర్ చేసినట్లు అలాగే 01-11-2025 నుండి 15-11-2025 వరకు చింతలపూడి, లింగపాలెం, టి. నరసాపురం మరియు కామవరపుకోట మండలాలలో (11 ) మందిని బైండోవర్స్ చేసారనిఎక్సైజ్ సి ఐ అశోక్ తెలిపారు.అలాగే టి. నరసాపురం మండలం పరిధిలోని టి. నరసాపురం గ్రామంలోని లైసెన్స్ కలిగిన మద్యం దుకాణాన్ని పరిశీలించి సంబంధిత షాపు యజమానికి ఎక్సైజ్ శాఖ నియమావళి ప్రకారం వ్యాపారం నిర్వహించాలని, అన్ని మద్యం సీసాలను ఏ. పి. ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా స్కాన్ చేయాలని సూచనలు ఇచ్చినట్లుగా చింతలపూడి ఎక్సైజ్ సి. ఐ. పి. అశోక్ తెలిపారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకున్న ఎన్ఫోర్స్మెంట్ అధికారులు

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్
(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా రాత్రి 2.00 గం. లకు శ్రీ కే. నాగేశ్వర రావు, రీజినల్ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారి, ఏలూరు వారికి రేషన్ బియ్యం అక్రమముగా రవాణా జరుగుచున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం ప్రకారం వారి ఆదేశాల మేరకు చింతలపూడి మండలం, ఫాతిమాపురం అడ్డ రోడ్ నందు 39 0258 నెంబర్ గల అశోక్ లే ల్యాండ్ బడా దోస్త్ ను ఆపి విజిలెన్సు, రెవిన్యూ మరియు పౌర సరఫరా అధికారులు సంయుక్తంగా తనికీ చేయగా 35.09 క్వింటాళ్ళ రేషన్ బియ్యం అక్రమముగా రవాణా జరుగుచున్నట్లు గుర్తించి డ్రైవర్ ను ప్రశ్నిOచగా, ఆతను (1)కటారి శ్రీను, ధర్మాజిగూడెం, లింగపాలెం మండలం (2)నున్నా రమేష్, ప్రగడవరం (3)చిలకమ్మా, ఫాతిమాపురం (4)సీత రాములు, సంకుచక్రపురం, చింతలపూడి మండలం వారికి చెందినవి అని వారి పరిసర ప్రాంతాలలో రేషన్ కార్డు దారుల వద్ద కిలో రు.13/-లు కు కొనుగోలు చేసి వాటిని చాట్రాయి మండలం, మర్లపాలెం గ్రామం నకు చెందిన పెద్దిరెడ్డి రామ చంద్ర రావు మరియు వంగర దత్తు లకు కిలో రు.19/-లకు అమ్ముచున్నట్లుగా తెలియచేసారు. ఈ తనికీలో రు.1,40,360/-లు విలువ కలిగిన బియ్యం మరియు రు.8,00,000/-లు విలువ వాహనము సీజ్ చేసి (1)కటారి శ్రీను, ధర్మాజిగూడెం, లింగపాలెం మండలం (2)నున్నా రమేష్, ప్రగడవరం (3)చిలకమ్మా, ఫాతిమాపురం (4)సీత రాములు, సంకుచక్రపురం, చింతలపూడి మండలం, పెద్దిరెడ్డి రామ చంద్ర రావు మరియు డ్రైవర్ కలపాల సుధాకర్ అనువారల పై నిత్యవసరవస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేయడమైనది. ఈ తనికీ నందు విజిలెన్సు ఎస్ ఐ శ్రీ సిహెచ్ రంజిత్ కుమార్ మరియు రెవిన్యూ, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు

# ఉమ్మడి పశ్చిమ గోదావరి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ యు. రవిచంద్ర

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్
(శుభోదయం న్యూస్):



ఏలూరు ఉమ్మడి పశ్చిమ గోదావరి మహిళా పోలీస్ స్టేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిజిపి శ్రీ హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ వారి యొక్క ఆదేశాల మేరకు, శ్రీ యు. రవిచంద్ర ఈరోజు ఉమ్మడి పశ్చిమ గోదావరి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పదవి బాధ్యతలను స్వీకరించారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శ్రీ రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. మహిళ లు మరియు బాలికల రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, మహిళలపై జరిగే నేరాల విషయంలో వేగవంతమైన, పారదర్శకమైన విచారణకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఫిర్యాదుదారునికి సమర్థవంతంగా, సానుకూలంగా న్యాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ స్టేషన్లు, మహిళా కౌన్సిలింగ్ సెంటర్లు మరియు ఇతర మహిళా రక్షణ విభాగాలతో పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మహిళా భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, తెలియజేశారు

# వ్యక్తిగత మరియు సామూహిక పరిశుభ్రత పై అవగాహన

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్
(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా చింతలపూడి, ప్రభుత్వం డిగ్రీ కళాశాల, స్వచ్ఛంద్ర స్వర్ణాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు కళాశాలలో వ్యక్తిగత మరియు సామూహిక పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంలో కళాశాల ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరిశుభ్రత పట్ల బాధ్యతాభావం పెంపొందించడం అత్యంత అవసరం అని, పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది అని చెప్పారు. ప్రతి విద్యార్థి తన వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, సమాజ పరిశుభ్రతలో కూడా భాగస్వాములు కావాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ యన్ జె కె నరేంద్ర కుమార్ మాట్లాడుతూ, స్వచ్ఛంద సేవా భావం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతా చైతన్యాన్ని పెంచుతుందని, మొక్కల నాటడం భవిష్యత్ తరాలకు అందించే అమూల్యమైన బహుమతి అన్నారు. కళాశాల పరిసరాలను శుభ్రం చేయడంలో విద్యార్థులు చూపిన ఉత్సాహాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ వి ఆర్, ఆంగ్ల విభాగ అధిపతి బి శ్రీనివాసరావు , వాణిజ్య విభాగ అధిపతి పి.రాజబాబు, అధ్యాపకులు మరియు విద్యార్థులు, పాల్గొన్నారు.

## రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో నిద్రిస్తున్న విద్యార్థి పై గుర్తు తెలియని విద్యార్థి దాడి

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా చింతలపూడి ఏపీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో గత అర్ధరాత్రి విద్యార్థులు నిద్దరలో ఉండగా ఒక బాలుడు గుర్తుతెలియని మరో విద్యార్థి గొంతు కోసినట్లు సమాచారం అందుకున్న శాసన సభ్యులు హుటాహుటిన చింతలపూడి ఏరియా హాస్పిటల్ కు చేరుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, విద్యార్థి ఆరోగ్య పరిస్థితి పై వైద్యులను అడిగి తెల్సుకున్నారు, గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యాసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు, జరిగిన ఘటన పై విద్యాశాఖ డి ఈ ఓ డిప్యూటీ మరియు స్థానిక విద్యాశాఖ, పోలీస్ శాఖ వారితో సమీక్షించారు, ఇలాంటి ఘటనలు మళ్ళీ మళ్ళీ పునరావృతం కాకుండా విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, విద్యార్థుల వద్ద పదునైన వస్తువులు లేకుండా చూడాలని మరియు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ అధికారులను ఆదేశించారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై 72 కేసులు నమోదు

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్(శుభోదయం న్యూస్):




గత నెల కర్నూలు వద్ద జరిగిన ట్రావెల్ బస్సు ప్రమాదం నేపథ్యములో రాష్ట్రవ్యాప్తంగా వాహన తనిఖీ అధికారులు ప్రైవేట్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై విస్తృతం స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్న విషయము పాఠకులకు తెలిసినదే. దీనిలో భాగంగా ఏలూరు జిల్లాలో కలపర్రు టోల్గేట్ మరియు జంగారెడ్డిగూడెం పట్టణములో ఆర్టీవోలు ఎస్.బి.శేఖర్ మరియు ఎస్.ఎస్.రంగనాయకులు పర్యవేక్షణ లోని మోటార్ వాహనాల తనిఖీ అధికారుల ప్రత్యేక బృందాలు ప్రైవేట్ కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులపై సోమవారం నుంచి శుక్రవారం రాత్రి వరకు 72 కేసులు నమోదు చేసినట్లు ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ శనివారం తెలియచేశారు. 7,65,230 రూపాయలు అపరాధరుసుము విధించగా, 4,50,100 రూపాయలు ఇప్పటి వరకు వసూలు అయినట్లు ఆయన తెలిపారు. సరైన ధ్రువపత్రాలు చూపని, అత్యవసర ద్వారం, అగ్నిమాపక పరికరాలు, ప్యాసింజర్ లిస్టు లేని మరియు తదితర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ ప్రత్యేక తనిఖీలు ప్రతి రోజూ కొనసాగుతాయని డీటీసీ కరీమ్ తెలిపారు.

## తెలుగు గంగ డ్యామ్ నందు కృష్ణా జలాలకు జలహార తీర్చిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):



తెలుగు గంగ డ్యామ్ ను పూర్తి స్థాయిలో నింపి రైతుల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట.. బ్రహ్మంగారిమఠం నందలి తెలుగుగంగ డ్యామ్ నందు కృష్ణా జలాలకు జలహారతి ఇచ్చిన మైదుకూరు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ . ఎమ్మెల్యే పుట్ట సుధాకర్ యాదవ్ గారి కృషితో తెలుగుగంగ డ్యామ్ చరిత్రలో మొదటి సారిగా 17.2 సామర్థ్యంతో నీటిని నింపటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు గంగ డ్యామ్ నందు చరిత్రలోనే మొదటిసారిగా పూర్తి స్థాయితో నింపటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. దీనివలన రైతులకు పుష్కలంగా నీరు అందుబాటులో ఉంది, పంట బాగా పండేందుకు తోడ్పడుతుందని తెలిపారు. అలాగే చుట్టుపక్కల మండలాలకు త్రాగునీటి సమస్య లేకుండా కొన్ని సంవత్సరాల వరకు నీరు అందుతుందని తెలిపారు. ఎమ్మెల్యే గారు తెలుగు గంగ జలాలకు పూజలు నిర్వహించి, హారతి ఇవ్వటం జరిగింది.

## మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ ను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):



బ్రహ్మంగారిమఠం మండలం నంది పల్లె పంచాయతీలో మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ ను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రవీంద్ర మార్కెట్ డైరెక్టర్ శీలం నరసింహ గౌడ్ వైస్ చైర్మన్లు డైరెక్టర్లు మొదలైన వారు పాల్గొన్నారు..

# గిరిజన విప్లవ వీరుడు... బిర్సా ముండా ఐటీడీఏలో బిర్సా ముండా 150 వ జయంతి వేడుకలకు హాజరైన- ఎమ్మెల్యే చిర్రి





**పోలవరం ప్రతినిధి(శుభోదయం న్యూస్):**

కేఆర్ పురం ఐటిడిఏలో నిర్వహించిన బిర్సా ముండా 150వ జయంతి వేడుకలకు ముఖ్యతిథిగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హాజరయ్యారు . గిరిజన విప్లవ వీరుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా, కేఆర్ పురం ఐటిడిఏలో శనివారం నిర్వహించిన వేడుకలకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హాజరయ్యి, ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బిర్సా ముండా, కొమరం భీమ్ ఆదివాసీ మహనీయుల విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార – ఆర్గానిక్ ఫుడ్ స్టాల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు విన్యసించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి వారిని అభినందించారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా వైజాగ్‌లో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో విజయాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ "ఆదివాసీ ప్రజల హక్కుల కోసం, బడుగు బలహీన అణగారిన వర్గాల కోసం పోరాడిన బిర్సా ముండా వంటి మహనీయుల త్యాగాలు ప్రతి యువతకు ప్రేరణ అని, వారి ఆశయాలను నిలబెట్టే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆదివాసీ గ్రామాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపి స్పోర్ట్స్ అధారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, ఎస్టీ కమిషన్ సభ్యులు కాకి లక్ష్మి, గ్రీన్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ బుట్టాయిగూడెం మండల అధ్యక్షులు బుచ్చిరాజు, ఐటీడీఏ అధికారులు, వివిధ శాఖల అధికారులు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# బోగోలు మండలంలో ఘనంగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

**బిట్రగుంట(శుభోదయం న్యూస్):**







బోగోలు మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలి రాజావీధిలోని ప్రాథమిక పాటశాల, చెంచులక్ష్మి పురంలోని నాగులవరం ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం కార్యాలయ ప్రాంగణంలోశనివారం మండలకన్వీనర్ నాగేశ్వరావు,పి.ఎ.సి.యస్ అద్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కేక్ కటింగ్ నిర్వహించిన అనంతరం పేద ప్రజలకు దుప్పట్లు,చీరలు మరియు సుమారు 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పై కార్యక్రమంలో నాగులవరం సొసైటీ డైరెక్టర్లు వాయిల సుధాకర్, సొసైటీ డైరెక్టర్ లక్కాకుల మాధవరావు,మండల టిడిపి ఉపాధ్యక్షులు కుంచాల తిరుమలేశు ప్రధాన కార్యదర్శి లేళ్ల పల్లి సుధీర్,ప్యాట్రిక్ దేవరాల తిరపతి, మండలబిజెపి అధ్యక్షులు వీరాల శ్రీనివాసులు యాదవ్, మాజీ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు కాంద్ర రఘురాములు గణేశంరమేష్ రెడ్డి, మండల ఐటీడీపీ అధ్యక్షులు గోచిపాతల సంజయ్, గనిపినేని నాగరాజు, అర్పుత రాజ్ (మాక), ,పుచ్చకాయల రమేష్, బుద్ధయ్య, మహిళ నాయకురాలు మల్లి అరుణమ్మ,ఎల్లమ్మ, పులిలిందల వినోద్, గోసాల శ్యాంసుందర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కొత్తపట్నం ఎస్సై కు సైక్లోన్ ఫైటర్ అవార్డు

**కొత్తపట్నం, (శుభోదయం న్యూస్):**



కొత్తపట్నం ఎస్సైవేముల సుధాకర్ కు శనివారం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు చేతుల మీదుగా సైక్లోన్ ఫైటర్ అవార్డును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైక్లోన్ ను సమర్థవంతంగా ఎదుర్కొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తుఫాను దీటుగా ఎదుర్కొన్నందుకు ఈ అవార్డు ఇచ్చినట్లు కొత్తపట్నం ఎస్సై మేము సుధాకర్ విలేకరులకు తెలియజేశారు. ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు.జిల్లా, మండల అధికారుల ఆదేశాలు మేరకు ప్రతి సందర్భాన్ని పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు ఇలాంటి సైక్లోన్ ను సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు గర్వంగా ఉందని తెలిపారు. మాకు సహకరించిన పోలీసు సిబ్బంది, కొత్తపట్నం మండలం ప్రజలకు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## యర్రగొండపాలెంలో ఘనంగా 72 వ అఖిల భారత పరపతి సహకార సంఘ వారోత్సవాలు

**ఎర్రగొండపాలెం మండల, రిపోర్టర్ నారాయణ(శుభోదయం న్యూస్):**



72 వ అఖిల భారత సహకార పరపతి సంఘం వారోత్సవాల సందర్భంగా శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని పరపతి సంఘం భవనం నందు నిర్వహించిన కార్యక్రమంలో మార్కాపురం డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి పి. రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని సహకార సంఘ పతాక ఆవిష్కరణ చేశారు..అనంతరం త్రిమెన్ కమీటి నెంబర్లు సంఘసభ్యులు ,మరియు సంఘ సిబ్బందితో ప్రతిజ్ఞ చెయించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వున్న సన్న చిన్నకారు రైతులకు అందుబాటులో ఉంటూ సహకార సంఘాలద్వారా విస్తృత సేవలు చేయలన్నారు, గ్రామాలలో అర్హులైన ప్రతి రైతు సహాకార సంఘాలలో సభ్యత్వం పొందాలని ,సహాకార రంగ అభివృద్దికి సిబ్బఃది తమ వంతు సహాకారం అందించాలని ఆయన సూచించారు ...ఈ కార్యాక్రమంలో సహాకార పరపతి సంఘం చైర్ పర్సన్ యాపర్తి వీరయ్య , పిడిసిసి బ్యాంకు మెనేజరు షకీల్ అహమ్మద్ , సూపర్ వైజర్ అబ్దుల్ రహీమ్ ,లతోపాటు సంఘ ముఖ్యకార్యాదర్శి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు పండించే ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

**ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్(శుభోదయం న్యూస్):**



ఏలూరు జిల్లా కోయిలగూడెం మండలంలో రైతు పండించే ధాన్యం పంటను దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పోసారావు తెలిపారు. మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో పిఎసిఎస్ సొసైటీ వద్ద కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరింపూడి పంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, సొసైటీ అధ్యక్షులు దుగ్గిన శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి, జనసేన పట్టణ అధ్యక్షులు మాదేపల్లి శ్రీనివాస్, తాసిల్దార్ నాగరాజు, బొబ్బర చినరాజు, కూటమి పార్టీల నాయకులు రైతులు పాల్గొన్నారు.

# కోడుమూరు టౌన్‌లోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కోడుమూరు ఎమ్మెల్యే

**కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):**



కోడుమూరు లో బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఏర్పాట్లను పరిశీలించారు .అలాగే స్థానిక హెడ్ మాస్టర్ పాఠశాలలో బోధనేతర సిబ్బంది కొరత ఉందని ఎంఎల్ఏ దృష్టి కి తెచ్చారు.ఎంఎల్ఏ వెంటనే స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే పక్కన ఉన్న ఎస్సీ హాస్టల్ ను సందర్శించి విద్యార్థుల వసతి సౌకర్యాలు, భోజన నాణ్యత, నీటి సదుపాయాలు, శుభ్రత, భద్రతా ఏర్పాట్లు, పాఠశాల హాజరు వంటి అంశాలను ఎమ్మెల్యే సమీక్షించారు. అక్కడున్న సిబ్బందితో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. హాస్టల్‌లో ఉన్న లోటుపాట్లను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పాటు, విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. కోడుమూరు ప్రాంతంలోని ప్రభుత్వ హాస్టళ్లలో మరింత మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయని ఎమ్మెల్యే గారు తెలిపారు. ఇటీవల ఇద్దరు విద్యార్థులపై దాడి జరిగిన ఘటన చాలా దురదృష్టకరమని అలాంటి ఘటన పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత హాస్టల్ సిబ్బంది చూసుకోవాలన్నారు.

## ఈనెల 30న చీరాలలో ఆంధ్రప్రదేశ్ చేనేత సదస్సు

**విశాఖపట్నం, (శుభోదయం న్యూస్):**



విశాఖపట్నంలో పద్మశాలి కళ్యాణ మండపంలో ఈనెల 30న చీరాలలో జరుగుతున్న, ఆంధ్రప్రదేశ్ చేనేత సదస్సును జయప్రదం చేయాలని విశాఖపట్నం జిల్లా చేనేత నాయకుల్ని కోరిన ఆలిండియా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ బక్కా పరంజ్యోతి, ఏఐబిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ధరణికోట లక్ష్మీనారాయణ, ఏఐబిఎస్పి రాష్ట్ర మహిళ చైర్మన్ విమేశ్వర్, ఏఐబిఎస్పి రాష్ట్ర మహిళ కన్వీనర్ లక్ష్మీ,ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని జిల్లా చేనేత నాయకులు పప్పు రాజా రావు, అప్పారావు, వెంకటేశ్వరావు, ఎస్ అప్పారావు తదితర రాష్ట్ర జిల్లా నాయకులు పాల్గొనడం జరిగింది.

## డక్కిలి గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా మాముండూరు రమేష్

**వెంకటగిరి నియోజకవర్గం, ఇంచార్జ్ విసీ సుబ్బరాయుడు(శుభోదయం న్యూస్):**



తిరుపతి జిల్లా డక్కిలి మండలం డక్కిలి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన మాముండూరు రమేష్ ఎన్నుకొన్నారు. ఇందులో భాగంగా పంచాయతీ పరిధిలోని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు పాలంరెడ్డి కోటేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రనాయుడు ఆదేశాల మేరకు డక్కిలి పంచాయతీ తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా మామూదూరు రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగ మాముండూరు రమేష్ మాట్లాడుతూ టీడీపీ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబయుడు ఆదేశాల మేరకు అలాగే మా ప్రియతమ నాయకులు వేంకటగిరి శాసన సభ్యులు కురుకొండ్ల రామకృష్ణ ఆదేశాలతో డక్కిలి మండల నాయకులు, పంచాయతి నాయకుల ఆధ్వర్యంలో నన్ను పంచాయతీ కార్యదర్శిగా టీడీపీ పార్టీ ఎన్నుకొన్నందుకు పేరుపేరునా అందరికి కృతజ్ఞతలు తెలియజేస్తూన్నారు. పార్టీ నాపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

# సంక్రాంతి నాటికి చింతలపూడి నియోజవర్గంలో అన్ని రహదారుల పనులు పూర్తి చేసేలా (ఆర్ అండ్ బి) అధికారులును ఆదేశించిన ఎమ్మెల్యే రోషన్ కుమార్

**ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్(శుభోదయం న్యూస్):**



ఏలూరు జిల్లా చింతలపూడి నియోజకవర్గంలో సంక్రాంతి నాటికి రహదారుల పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని చింతలపూడి శాసనసభ్యులు రోషన్ కుమార్ (ఆర్ అండ్ బి) ఉన్నత అధికారులను కోరారు. శనివారం ఏలూరు ఆర్ అండ్ బి సర్కిల్ కార్యాలయంలో అధికారులతో కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరై నప్పటికీ ,పనులలో జాప్యం చేయడం పట్ల ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు. ఏలూరు జంగారెడ్డిగూడెం రహదారి ఆరు కిలోమీటర్ల మేర 10,30 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు రోషన్ కుమార్ తెలిపారు. సోమవారం నుండి రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆదివారం భూమి పూజ చేస్తామని రోషన్ కుమార్ పేర్కొన్నారు. ఆడమిల్లి వంతెన డైవర్షన్ పనులు 20 లక్షలతో ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చింతలపూడి రావికంపాడు రోడ్డు ఆరు కోట్ల వ్యయంతో నిర్మించనున్నారని వారం రోజులలో పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చింతలపూడి- ఏలూరు, చింతలపూడి మేడిశెట్టి వారి పాలెం రోడ్ల అభివృద్ధికి 4.14 కోట్లు మంజూరు చేయడం జరిగిందని టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభించ బడతాయన్నారు. చింతలపూడి కామవరపుకోట రోడ్డు 1.8 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే రోషన్ కుమార్ తెలిపారు. రంగాపురం-తడికలపూడి, రంగాపురం బిజిలకరగూడెం రోడ్ల అభివృద్ధికి రెండు కోట్ల 90 లక్షలు తో ప్రతిపాదన పంపామన్నారు. చింతలపూడి పట్టణంలో మరియు ధర్మాజీగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నాలుగు కోట్లతో ప్రతిపాదన పొందామన్నారు. నియోజవర్గంలో అన్ని ముఖ్య రహదారులు సంక్రాంతి నాటికి పూర్తి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు

## దొండ పంటను పండించే రైతుకు ఎకరానికి లక్ష రూపాయలు రాయితీ

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్ (శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా కోయిలగూడం మండలంలో దొండ పంటను పండించే రైతుకు ఎకరానికి లక్ష రూపాయలు రాయితీ కల్పిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి షాజ నాయక్ పేర్కొన్నారు. మండలంలో అచ్యుతాపురం గ్రామంలో దొండపాదుల పందుర్లను శనివారం మండల ఉద్యాన శాఖ అధికారి దిరాజ్ లక్ష్మణ్ తో కలిసి ఆయన పరిశీలించారు. తీగ పందుర్ల ద్వారా పంటను పండించుకునే రైతులకు పండు ఈగ నుంచి బయటపడే మార్గం కోసం ఫర్మన్ ట్రప్స్ ను వాడాలని పలు సూచనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజా ఆరోగ్యం

ఏలూరు జిల్లా, ప్రతినిధి -ప్రసాద్(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా కోయిలగూడెం మండలంలో పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం మెండుగా ఉంటుందని రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘాదేవి పేర్కొన్నారు. పరింపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మేఘలాదేవి మాట్లాడుతూ మనిషి ఆరోగ్యం బాగుండాలంటే వ్యక్తిగత శుభ్రతతో పాటు మన చుట్టూ ఉన్న పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె తెలిపారు. విజయ కుమారి మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకున్న తరువాత ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు. ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలు సూచనలను ఆమె ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది , ఉపాధ్యాయులు, ఎంపీపీ పాఠశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

## సైకిళ్లపై శబరిమలై యాత్రను ప్రారంభించిన రాకేష్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నరసింహారాజు

ఏలూరు జిల్లా, ప్రతినిధి ప్రసాద్(శుభోదయం న్యూస్):



ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలో గవరవరం, కొయ్యలగూడెం గ్రామాలకు చెందిన పలు అయ్యప్ప స్వామి మాలాదారులు శబరిమలైన అయ్యప్ప స్వామి కొండకు శనివారం సైకిల్ యాత్రగా కొయ్యలగూడెం వినాయకుని ఆలయ వద్ద నుండి బయలుదేరి వెళ్లడం జరిగింది. 41 రోజులపాటు అయ్యప్ప స్వామి మాల లో ఉండి భక్తిశ్రద్ధలతో దీక్షను కొనసాగించడం జరిగిందని, ఆకుల రాము తెలిపారు. శబరిమలై వెళ్లడానికి సైకిల్ పై 13 రోజులపాటు యాత్ర కొనసాగిస్తామని రాము తెలిపారు. సైకిల్ యాత్రను గవరవరం సాయి రాకేష్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ నరసింహారాజు ప్రారంభించారు. శుగ్రబోయిన సత్తిపండు, ముత్ర బొయిన నాగప్రసాద్, చెల్లారి పోసి రావు లు సైకిల్ యాత్రలో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నారాయణ , స్వాముల కుటుంబాల వారు పాల్గొన్నారు.


## మోపూరి వారి వివాహ మహోత్సవం తెదేపా నాయకుల సందడి

బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి(శుభోదయం న్యూస్):



బ్రహ్మంగారిమఠం మండలంలోని రెకలకుంట పంచాయతీలో మోపూరి కుటుంబం ఏర్పాటు చేసిన వివాహ మహోత్సవం ఈరోజు గ్రామంలో అద్భుతమైన వాతావరణాన్ని నెలకొల్పింది. సంప్రదాయం, ఆనందం, అతిథి సత్కారాలు కలగలిపిన ఈ కార్యక్రమానికి స్థానిక తెదేపా నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ శుభసందర్భంగా ముఖ్యంగా మండల టిడిపి అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సహకార పరిషత్ సంఘం చైర్మన్ యల్లటూరి సాంబశివరెడ్డి, మండల యువ నాయకులు కానాల మల్లికార్జున రెడ్డి, విచ్చేసి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు గుజ్జు రామాంజనేయులు, పుటాల శివ యాదవ్, మోపురి గంగన్న, కర్రె ఓబయ్య, సి.ఆర్. వెంకటేష్, మస్తాన్, బ్రహ్మనాయుడు, రమణారెడ్డి, ఓబుల్ రెడ్డి, నాగిపోగు మధు తదితర నాయకులు, కార్యకర్తలు వివాహ వేడుకకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించి, మోపూరి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త జీవితాన్ని ప్రారంభించిన వధూవరులకు గ్రామ ప్రజలు, నాయకులు, బంధువులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న పోతిరెడ్డి నాగార్జున్ రెడ్డి





బద్వేల్ నియోజకవర్గం, రిపోర్టర్ శివారెడ్డి (శుభోదయం న్యూస్):

శ్రీ అవధూత కాశినాయన మండలం ఇటుకులపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి.శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం. ల్యాబ్ రామ్మోహన్ రెడ్డి. గారి ఆధ్వర్యంలో. ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గురు స్వాములు. కన్య స్వాములు. అయ్యప్ప స్వాములు. భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది. గ్రామస్తులు మహిళలుపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆయన తర్వాత అయ్యప్ప స్వాములు బిక్ష. చేసిన తర్వాత . గ్రామస్తులకు ప్రత్యేకంగా భోజనం వసతులు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో. మాజీ పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి పాల్గొన్నారు. పూజ అనంతరం నాగర్జున రెడ్డి గారిని రామ్మోహన్ రెడ్డి మరియు అయ్యప్ప స్వాములు సన్మానించడం జరిగింది.

# సీసీ రోడ్డు నిర్మాణం వెడల్పు 40 అడుగులకు పెంచాలి





**-సీపీఐ**

కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం (శుభోదయం న్యూస్):

సి బెళగల్ ఆర్ అండ్ బి అధికారులను చుట్టుముట్టిన సీపీఐ,మండల ప్రజలు సమాధానం చెప్పడానికి నీళ్లు నమిలిన అధికారులు సి.బెళగల్ మండల కేంద్రంలోని రోడ్డు నిర్మాణం వెడల్పు 40 అడుగులకు పెంచాలని కోరుతూ సీపీఐ బెళగల్ మండల సమితి ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనుల దగ్గర ఆందోళన నిర్వహించారు.ఈ ఆందోళన కార్యక్రమానుద్దేశించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. రాజు, జిల్లా సమితి సభ్యుడు శ్రీరాములు గౌడ్ మాట్లాడుతూ ప్రధాన రహదారి లేక మండల ప్రజలు గత అనేక సంవత్సరాలనుండి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు నిర్మాణం చేపట్టాలని గతంలో అనేకసార్లు ఆందోళన నిర్వహించిన ఫలితంగా రోడ్డు నిర్మానానిక ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, అందులో భాగంగానే రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని అయితే చేపడుతున్న రోడ్డు నిర్మాణం కేవలం 20 అడుగులు వెడల్పు మాత్రమే నిర్మాణం చేపడుతున్నారని దీనివలన సమస్య పరిష్కారం కాకపోగా ఇంకా సమస్య పెరిగే అవకాశం ఉందని సీపీఐ నాయకులు ఆర్ అండ్ బి అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు.20అడుగుల రోడ్డు నిర్మాణంతో చాలా చిన్నదిగా రోడ్డు తయారవుతుందని, అప్పుడు వ్యాపార వర్గాలు, ప్రజలు అనేక ప్రమాదాలకు ఆర్ అండ్ బి అధికారులు కారణమావుతారని ప్రశ్నించడంతో అధికారులు చేసేది ఏమిలేక వినతిపత్రం తీసుకోని అక్కడినుండి వెళ్లిపోయారు. అక్కడినుండి సీపీఐ నేతలు, గ్రామ ప్రజలు ఎంపిడిఓ కార్యాలయానికి చేరుకొని సమస్యను వివరించి వినతిపత్రం అందచేశారు. పదిరోజుల లోపు సమస్యను పరిష్కరించకపోతే మండల ప్రజలను కలుపుకొని పెద్దఎత్తున వరుస ఆందోళన కార్యక్రమాలకు సిద్ధం అవుతామని హెచ్చరిస్తున్నాము. ఈ ఆందోళన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మల్లిఖార్జున, నాయకులు నల్లన్న, పక్కిరన్న, చిన్న నాగన్న, రాముడు, పెద్ద నాగన్న, గోవిందు, స్థానిక మండల ప్రజలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై దాడి చేసిన టి నరసాపురం ఎస్ఐ,జయ బాబు,సిబ్బంది

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, రిపోర్టర్ కిషోర్ బాబు(శుభోదయం న్యూస్):

ఏలూరు జిల్లా పోలవరం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు ఆదేశాలు, జీలుగుమిల్లి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు,పర్యవేక్షణ మేరకు, టి. నరసాపురం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపు లోకి తీసుకొన్న టి. నరసాపురం ఎస్ఐ జయబాబు సిబ్బందితో కలిసి అందిన పక్కా సమాచారం ఆధారంగా టి. నరసాపురం మండలం, అప్పలరాజు గూడెం గ్రామ శివారులో ఈ దాడులు నిర్వహించారు.అదుపులోకి తీసుకున్న వ్యక్తులు: నలుగురు (4) వ్యక్తులు. వారి వద్ద నుంచి నగదు రూ. 9,200/- లు, 52 పేక ముక్కలు, మరియు నాలుగు (4) మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేసిన వ్యక్తులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, టి. నరసాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది.



# మహాత్మా గాంధీ చిరస్మరణీయమైన అహింసా మార్గాన్ని విద్యార్థి లోకం స్ఫూర్తిగా తీసుకోవాలి

**భారత సుప్రీం కోర్టు న్యాయమూర్తి గౌ.శ్రీ జస్టిస్ పి ఎస్ నరసింహ**

విశాఖపట్నం, (శుభోదయం న్యూస్):

జాతిపిత మహాత్మా గాంధీ చిరస్మరణీయమైన అహింసా మార్గాన్ని విద్యార్థి లోకం స్ఫూర్తిగా తీసుకోవాలని భారత సుప్రీం కోర్టు న్యాయమూర్తి గౌ.శ్రీ జస్టిస్ పి ఎస్ నరసింహ విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డి ఎస్ ఎన్ ఎల్ యు) విశాఖపట్నం సంయుక్త స్నాతకోత్సవం సందర్భంగా ది:05/09/2025వ సంవత్సరం తేదీ శుక్రవారం సాయంత్రం విశ్వవిద్యాలయ క్యాంపస్ లో వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశ్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఫాదర్ ఆఫ్ ది నేషన్"మహాత్మా గాంధీ,"ఫాదర్ ఆఫ్ ద కానిస్టిట్యూషన్" డా.బి.ఆర్.అంబేద్కర్, భారత దేశంలో మొట్ట మొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య గార్ల విగ్రహాలను సుప్రీం కోర్టు న్యాయమూర్తి గౌ శ్రీ జస్టిస్ పి ఎస్ నరసింహ గారితో కలసి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ గౌ.శ్రీ.ధీరజ్ సింగ్ ఠాకూర్ గార్లు సదరుపై ముగ్గురు జాతీయ నాయకుల విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గౌ.శ్రీ.జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ ఈ దేశంలో పుట్టిన ప్రతీ పౌరుడు రాజ్యాంగ శాసనానికి లోబడి జీవించాలని, న్యాయవాద వృత్తిలో ఉన్నవారు మరింత శాసనబద్ధంగా జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్ వెంకటరావు, ఏపీ హైకోర్టు రిటైర్డ్ జడ్జి గౌ శ్రీ జస్టిస్ సోమయాజులు, ప్రముఖ విద్యావేత్త డా.అలుగు ఆనంద శేఖర్ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్టర్ డా.మదాసు విశ్వ చంద్రనాథ్,విశ్వ విద్యాలయ సిబంది విశాఖ జిల్లా జ్యుడీషియల్ అధికారులు, అనధికారులు, విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సంక్రాంతి నాటికి చింతలపూడి నియోజవర్గంలో రహదారుల పనులు పూర్తి రోషన్ కుమార్





**ఏలూరు జిల్లా(శుభోదయం న్యూస్):**

ఏలూరు జిల్లా ఏలూరు ఆర్ అండ్ బి,సర్కిల్ కార్యాలయం0 లో సంక్రాంతి నాటికి రహదారుల పనులన్నీ పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాలని చింతలపూడి శాసనసభ్యులు రోషన్ కుమార్ ఆర్ అండ్ బి ఉన్నత అధికారులను కోరారు. శనివారం ఏలూరు ఆర్ అండ్ బి సర్కిల్ కార్యాలయంలో అధికారులు మరియు కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరై నప్పటికీ ,పనులలో జాప్యం చేయడం పట్ల ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు.ఏలూరు జంగారెడ్డిగూడెం రహదారి ఆరు కిలోమీటర్ల మేర 10:30 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు రోషన్ కుమార్, తెలిపారు.సోమవారం నుండి రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆదివారం భూమి పూజ చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆడమిల్లి వంతెన డైవర్షన్ పనులు 20 లక్షలతో ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చింతలపూడి రావికంపాడు రోడ్డు ఆరు కోట్ల వ్యయంతో నిర్మించ నున్నారని వారం రోజులలో పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.చింతలపూడి- ఏలూరు, చింతలపూడి మేడిశెట్టి వారి పాలెం రోడ్ల అభివృద్ధికి 4.14 కోట్లు మంజూరు చేయడం జరిగిందని టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభించ బడతాయన్నారు. చింతలపూడి కామవరపుకోట రోడ్డు 1.8 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.రంగాపురం-తడికలపూడి, రంగాపురం బిజిలకరగూడెం రోడ్ల అభివృద్ధికి రెండు కోట్ల 90 లక్షలు తో ప్రతిపాదన పంపామన్నారు. చింతలపూడి పట్టణంలో మరియు ధర్మాజీగూడెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నాలుగు కోట్లతో ప్రతిపాదన పొందామన్నారు. నియోజవర్గంలో అన్ని ముఖ్య రహదారులు సంక్రాంతి నాటికి పూర్తి చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగింది.

# 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో గోల్డ్ మెడల్ సాధించిన బాపట్ల జిల్లా కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర





**బాపట్ల జిల్లా(శుభోదయం న్యూస్):**

పెన్‌కాక్ సిలాట్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర,కర్లపాలెం కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను అభినందించిన జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ . జాతీయ స్థాయిలో సత్తా చాటిన బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్ కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ అభినందించారు. 2025 అక్టోబర్ 8 నుండి 16వ తేది వరకు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్ పట్టణంలో షేర్-ఏ-కాశ్మీరీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో వీరంకి నరేంద్ర సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించాడు. అతడు స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశాడు. ఎస్పీ గారు అతడిని ప్రత్యేకంగా అభినందించి మెడల్‌తో సత్కరించారు.జాతీయ స్థాయిలో జిల్లా పోలీస్ ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ 10వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ 2025లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో గోల్డ్ మెడల్‌ను సాధించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ తెలిపారు. గతంలో 2018, 2024, 2025ల్లో జాతీయ స్థాయిలో జరిగిన పలు క్రీడా పోటీలలో పాల్గొని పెన్‌కాక్ సిలాట్ విభాగంలో మెడల్స్ సాధించాడన్నారు. 2025 మేలో జరిగిన 13వ జాతీయ స్థాయి పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం, 2024లో జరిగిన సెకండ్ ఆల్ ఇండియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం, 2018లో 3వ ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించాడని తెలిపారు. రాబోయే రోజులలో మంచి తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. బాపట్ల జిల్లా పోలీస్ విభాగంలో క్రీడల పట్ల మక్కువ ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలు శారీరక ఆరోగ్యానికే కాక మానసిక ప్రశాంతతకు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. క్రీడల వలన ఒత్తిడిని సునాయాసంగా అధిగమించవచ్చునని ఎస్పీ తెలిపారు.

# ఆర్ ఎస్ ఆర్ స్కూల్ నందు విద్యా ఆణిముత్యాలు





**కావలి(శుభోదయం న్యూస్):**

కావలి పట్టణం, గౌరవరం లో గల ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు వైజ్ఞానిక ఉత్సవ్ 2025లో జరిగిన వైజ్ఞానిక సదస్సు నాకు ముఖ్య అతిథులుగా మాజీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ మరియు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.విద్యార్థులను ఉద్దేశించి స్కూలు యాజమాన్యం సిబ్బంది బహుముఖ ప్రజ్ఞాశాలుగా విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వైనాన్ని అబ్బురపడ్డాను అన్న మాజీ మంత్రి !ఈ వైజ్ఞానిక సదస్సులో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ అండ్ ఆర్ట్స్ విభాగాలలో ఎల్కేజీ యూకేజీ నుండి 12 క్లాసు వరకు విద్యార్థులు చూపిన ప్రతిభను వారు మెచ్చుకున్నారు. ఇటువంటి స్కూలును కావలి ప్రాంతంలో నిర్మించిన స్కూల్ కరస్పాండెంట్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శ్రీమతి ఆదిలక్ష్మి గార్లను కొనియాడారు, డబ్బు ఏ రంగంలో అయినా సంపాదించుకోవచ్చు, కానీ భావితరాలకు అందించే విద్య అమూల్యమైనదని అటువంటి విద్యను కావలి లాంటి ప్రాంతాల్లో ఉన్నతమైన విద్యను అందిస్తూ ఇంటర్నేషనల్ స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించడం ఉన్నత ప్రమాణాలతో అందించటం ఒక్క ప్రతాప్ కుమార్ రెడ్డి సార్ కు మాత్రమే సాధ్యమైందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తో పాటు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

**కర్నూలు జిల్లా, స్టాఫ్ రిపోర్టర్ పి నాగరత్నం(శుభోదయం న్యూస్):**



సి బెళగల్ మండల కేంద్రంలో సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మండల అభివృద్ధి అధికారిని రాణమ్మస్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు, అనంతరం ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పరిసరాలను పరిశుభ్రత పాటించాలని రోడ్లపై చెత్త వేయరాదని తెలియజేస్తూ ప్లాస్టిక్ ను నిర్మూలిధామని పిలుపునిస్తూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేస్తూ మనమందరము మంచి ఆలోచనలతో ఆరోగ్యవంతమైన శరీరము, స్వచ్ఛమైన వాతావరణము, ఇంటి దగ్గరే పని చేసే చోటా శుభ్రతలతో మన రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రగా -స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి బెలగల్ ఇన్చార్జి పంచాయతీ సెక్రటరీ శ్యామల మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు పంచాయతీ కార్యదర్శులు, సి బెళగల్ టిడిపి నాయకులు పి భీమన్న, అంగన్వాడీ టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఉన్న క్రీడా ప్రాంగణాన్ని సందర్శించిన కొవ్వాసు జగదీశ్వరి

**పోలవరం ప్రతినిధి(శుభోదయం న్యూస్):**



పోలవరం గ్రామంలో ఉన్న ఏకైక క్రీడా ప్రాంగణం ఒక్కటేనని ప్రస్తుతం దాని పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని పాఠశాల కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు షాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి వివరించారు. గతంలో మండలంలో అధికారులు, నాయకులు, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజలు ఏ విధమైన క్రీడా పోటీలు నిర్వహించిన పోలవరం హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించే వారిని ప్రస్తుతం గ్రౌండ్ పరిస్థితి క్రీడలకు అనుకూలంగా లేదని గ్రౌండ్ అభివృద్ధి చేసేందుకు తమ సహాయ సహకారాలు అందించాలని జగదీశ్వరిని కోరారు. ఈ సందర్భంగా షాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి మాట్లాడుతూ గ్రౌండ్ పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని గ్రౌండ్ పరిస్థితిని షాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు దృష్టికి తీసుకెళ్లి గ్రౌండ్ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తుందని హై స్కూల్ విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచేందుకు అవసరమైన క్రీడా కిట్లు అందజేసే విధంగా కృషి చేస్తానని జగదీశ్వరి, తెలిపారు.

# చరిత్రలో బ్రిటిష్ సైన్యాన్ని గడగడలాడించింది బిర్సా ముండా - జనార్ధన్ వేదుల

**జీలుగుమిల్లి(శుభోదయం న్యూస్):**





స్వాతంత్రోద్యమ చరిత్రలో బ్రిటిష్ సైన్యాన్ని గడగడలాడించి, గిరిజనులలో విప్లవాగ్నిని రగిలించిన “ భగవాన్” బిర్సా ముండా దేశభక్తి, స్వాభిమానం, పోరాటం, నేటి యువత, విద్యార్థులకు స్ఫూర్తిదాయకం కావాలని, వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల ఉపాధ్యాయులు వేదుల జనార్ధనరావు పిలుపునిచ్చారు. నేడు వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల నందు ప్రధానాచార్యులు ఎం వి ఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన, గిరిజనోద్యమ నాయకుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా జరిగిన సమావేశంలో, ఉపాధ్యాయుని కొవ్వాసి బాలాంజలి బిర్సా ముండా చి త్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చి.తెలిపేటి వెంకటేశ్వర్ రెడ్డి బిర్సా ముండా చిత్రపటాన్ని వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు. శివ శంకర్, కె.గౌరీ శ్రీ, వి.కామేశ్వరి, కె.వెంకటేశ్వరరావు, పేరం మహేష్, కొవ్వాసి బాలాంజలి, సిహెచ్.లక్ష్మి, విద్యార్థులు, తెలిపేటి వెంకటేశ్వర రెడ్డి, మడి ఈశ్వర్ రెడ్డి, బజరంగ్ దళ్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ను పరిశీలించిన జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్


**బాపట్ల జిల్లా(శుభోదయం న్యూస్):**

గంజాయి, హెరాయిన్ ఇతర మాదకద్రవ్యాలను గుర్తించడం సులభతరం కేసుల దర్యాప్తు వేగవంతంగా నిర్వహించడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది,జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటాం,జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్,జిల్లాలో గంజాయి రవాణా,విక్రయాలకు పాల్పడినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ హెచ్చరించారు. గంజాయి, హెరాయిన్ వంటి ఇతర మాదకద్రవ్యాలను సులభంగా గుర్తించేందుకు ఉపయుక్తంగా ఉండే డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఈగిల్ సెల్ విభాగం వారు బాపట్ల జిల్లాకు కేటాయించారు. జిల్లా ఎస్పీ గారు డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఓపెన్ చేసి పరిశీలించారు. కిట్‌ను ఏ విధంగా వినియోగించుకోవాలి, గంజాయి, హెరాయిన్ వంటి ఇతర మాదకద్రవ్యాలను ఏ విధంగా గుర్తిస్తుంది తదితర విషయాల గురించి ఆరా తీసి, క్లూస్ టీమ్ బృందానికి తగిన సూచనలు తెలిపారు.యువత ఉజ్వల భవిష్యత్తును అంధకారంగా మారుస్తున్న మాదకద్రవ్యాలను జిల్లాలో పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కార్యాచరణను రూపొందించామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. జిల్లాలో గంజాయి విక్రయాలు, అక్రమ రవాణాకు పాల్పడినా, వాటిని కలిగి ఉన్నా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు తమ స్వలాభం కోసం గంజాయి వంటి మాదకద్రవ్యాలను ద్రవ రూపాల్లో, చాక్లెట్‌లాంటి పదార్థాల లాగా తయారుచేసి రవాణా విక్రయాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. అటువంటి వాటిని సైతం డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌ల సహాయంతో సులభంగా పరీక్షించి నిర్ధారించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. క్లూస్ టీమ్ కు చెందిన సిబ్బందికి గంజాయి, హెరాయిన్ వంటి ఇతర మాదకద్రవ్యాలను కిట్ ద్వారా పరీక్షించడానికి తగిన శిక్షణ పొందడం జరిగిందన్నారు. స్థానికంగా ఉన్న క్లూస్ టీమ్ వాటిని పరీక్షించి ఇచ్చే నివేదిక ద్వారా మాదకద్రవ్యాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతంగా నిర్వహించడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బి-2 ఇన్‌స్పెక్టర్ ఎం. రాంబాబు, క్లూస్ టీమ్ ఎస్ఐ కె. వెంకటేష్, ఈగిల్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## దర్శకత్వంపై దృష్టి సారించిన రానా..




రామానాయుడు పెద్ద మనవడు రానా మొత్తానికీ తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. రామానాయుడు తన పెద్ద కొడుకు సురేశ్ బాబు ఇద్దరు పిల్లల్లో పెద్దవాడైన రానా ను దర్శకుడిని, చిన్న వాడైన అభిరామ్ ను హీరోను చేయాలని అనుకున్నారు. ఎందుకంటే తన కొడుకులిద్దరిలో సురేశ్ నిర్మాత కాగా వెంకటేశ్ హీరో. ఇద్దరూ ఎప్పుడూ మెగా ఫోన్ పట్టాలని అనుకోలేదు. అయితే రామానాయుడుకు మాత్రం చివరి వరకూ ఒక్క సినిమా అయినా డైరెక్ట్ చేయాలనే కోరిక ఉండేది. కానీ దానిని తీర్చుకోకుండానే ఆయన కన్నుమూశారు. రానా ను డైరెక్టర్ గా చూడాలని రామానాయుడు అనుకోవడానికి కారణం లేకపోలేదు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు.తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులు కున్నాడు కూడా. ఈ నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి మాట్లాడుతూ..... వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు.

## అనుకున్నట్లే 'వారణాసి' టైటిల్ ఫిక్స్

ప్రస్తుతం ఎక్కడ చూసినా మహేశ్-రాజమౌళి 'గ్లోబ్ ట్రాటర్' ఈవెంట్ హడావుడి గురించే డిస్కషన్. హైదరాబాద్ శివారులో ఈ కార్యక్రమం భారీగానే ప్లాన్ చేశారు. అభిమానులతో పాటు వేలాదిమంది దీన్ని వీక్షిస్తున్నారు. అయితే ఈవెంట్ ప్రారంభంలోనే మూవీ టైటిల్ ఏంటనేది ప్రకటించేశారు. గత కొన్నిరోజుల నుంచి అనుకుంటున్నట్లే 'వారణాసి' అని ఫిక్స్ చేశారు. టైటిల్ గ్లింప్స్ వీడియోని ఈవెంట్ స్క్రీన్ పై ప్రసారం చేశారు. టైటిల్ గ్లింప్స్ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయిపోతోంది. గత కొన్నిరోజుల నుంచి రుద్ర, వారణాసి.. ఇలా పలు టైటిల్స్ వినిపించాయి. వీటిలో ఏది పెడతారా అనే డిస్కషన్ అయితే నడిచింది. ఫైనల్‌గా రాజమౌళి 'వారణాసి' అనే పేరుకే కట్టుబడి ఉన్నట్లు ఇప్పుడీ వీడియోతో క్లారిటీ వచ్చేసింది. ఇందులో మహేశ్ బాబు రుద్ర అనే పాత్రలో కనిపించబోతున్నాడు. ప్రియాంక చోప్రా, మందాకిని పాత్రలో.. పృథ్వీరాజ్ సుకుమారన్, కుంభ అనే విలన్‌గా కనిపిస్తాడు. వీళ్లు ముగ్గురు కాకుండా ఇంకెవరెవరు ఉన్నారనేది వీడియోలో రివీల్ చేస్తారేమో చూడాలి?

## వంద కోట్ల డెబ్యూ.. ఎక్కడికి వెళ్లిపోయాడు?



తొలి సినిమాతోనే వంద కోట్ల వసూళ్లు రాబట్టడం అన్నది ఎంత పెద్ద బ్యాగ్రౌండ్ ఉన్న హీరోకైనా చాలా పెద్ద టార్గెట్టే. 'ఉప్పెన' సినిమాతో ఈ సెన్సేషనల్ ఫీట్ సాధించాడు వైష్ణవ్ తేజ్. ఆ సినిమా సక్సెస్ క్రెడిట్లో హీరోకు మేజర్ షేర్ ఇవ్వలేం కానీ.. డెబ్యూలోనే తన పేరు మీద వంద కోట్ల సినిమా ఉండడం మాత్రం తనకు పెద్ద ప్లస్ అనడంలో సందేహం లేదు. కానీ 'ఉప్పెన'తో వచ్చిన హైప్‌ను అతను సరిగా ఉపయోగించుకోలేకపోయాడు. వైష్ణవ్ రెండో చిత్రం 'కొండపొలం' దారుణమైన ఫలితాన్నందుకుంది. మూడో చిత్రం 'రంగ రంగ వైభవంగా', నాలుగో మూవీ 'ఆదికేశవ' ఒకదాన్ని మించి ఒకటి డిజాస్టర్లు అయ్యాయి. తొలి సినిమాతో వచ్చిన పేరు, మార్కెట్ మొత్తాన్ని తర్వాతి మూడు సినిమాలు తుడిచిపెట్టేసి వైష్ణవ్‌ను నేల మీదికి తెచ్చేశాయి. దీంతో తర్వాత ఎలాంటి సినిమా చేయాలనే విషయంలో అయోమయంలో పడిపోయాడీ మెగా కుర్రాడు. 'ఆది కేశవ' రిలీజై రెండేళ్లు కావస్తోంది. ఇప్పటిదాకా తన తర్వాతి సినిమాను వైష్ణవ్ ప్రకటించలేదు. అసలు ఈ రెండేళ్లలో తన కొత్త సినిమా గురించి ఏ కబురూ వినిపించకపోవడం ఆశ్చర్యకరం. మరీ ఇంత గ్యాప్ తీసుకుంటే ప్రేక్షకులు హీరోను మరిచిపోయే అవకాశముంది. కొత్త సినిమాకు బజ్ క్రియేట్ చేయడం కూడా కష్టమే. ఈ రెండేళ్లలో ఒక్క కథను కూడా ఓకే చేసి ముందుకు తీసుకెళ్లకపోయాడంటే వైష్ణవ్ అంత జాగ్రత్త పడుతున్నాడా.. లేక తన దగ్గరికి కథలు రావడం లేదా అన్నది ప్రశ్నార్థకం. ఐతే లేటెస్ట్‌గా వినిపిస్తున్న కబురేంటంటే.. అతను విక్రమ్ కుమార్ నుంచి నరేషన్ విన్నాడట. ఈ ప్రాజెక్టును సీరియస్‌గా పరిగణిస్తున్నాడట. విక్రమ్‌కు కూడా కెరీర్లో బాగా గ్యాప్ వచ్చింది. హలో, గ్యాంగ్ లీడర్, థాంక్యూ ఫ్లాపులతో అతను వెనుకబడిపోయాడు.

## 36 ఏళ్ల తర్వాత రిలీజ్ చేస్తే.. ఇప్పుడూ అదే హంగామా

నాగార్జున కెరీర్‌లో మైల్‌స్టోన్ లాంటి సినిమా 'శివ'. 1989లో థియేటర్లలో రిలీజైన ఈ మూవీ.. రాంగోపాల్ వర్మ అనే దర్శకుడిని ఇండస్ట్రీకి పరిచయం చేసింది. ఓ రకంగా చెప్పాలంటే టాలీవుడ్ రూపురేఖల్ని ఈ చిత్రం మార్చేసిందని చెప్పొచ్చు. సౌండింగ్, సినిమాటోగ్రఫీని సరికొత్త పుంతలు తొక్కించిన ఈ చిత్రం.. తాజాగా రీ రిలీజ్ అయింది. ఇప్పుడు కూడా అద్భుతమైన వసూళ్లు అందుకుంది. అప్పట్లో రూ.కోటి రూపాయల బడ్జెట్ పెడితే రూ.4 కోట్ల వరకు వసూళ్లు వచ్చాయట. దీంతో ఈసారి రీ రిలీజ్ చేద్దామని ఫిక్సవడంతో దాదాపు రూ.2 కోట్లు పెట్టి ఇప్పటి టెక్నాలజీకి తగ్గట్లు డాల్బీ సౌండ్, 4కె విజువల్స్ తీసుకొచ్చారట. గత కొన్ని నెలలుగా ఈ పనంతా రాంగోపాల్ వర్మ దగ్గరుండి చూసుకున్నారట. గత కొన్నిరోజులుగా కొత్త సినిమాలానే దీనికి కూడా ప్రచారం చేశారు. నాగ్, వర్మ కలిసి మీడియాతోనూ మాట్లాడారు. అలా థియేటర్లలోకి వచ్చింది. తొలిరోజు (నవంబరు 14) తెలుగు రాష్ట్రాల్లో మంచి రెస్పాన్స్ అందుకుంది. ఈ క్రమంలోనే రూ.2.5 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ వారం 'కాంత' తప్పితే పెద్దగా చెప్పుకోదగ్గ మూవీస్ ఏం రాలేదు. బహుశా ఇదే 'శివ' రీ రిలీజ్ కలెక్షన్లకు కలిసొచ్చినట్లు ఉంది. మరి ఈ వీకెండ్ అయ్యేసరికి 'శివ' ఇంకెన్ని కోట్లు కలెక్షన్ సాధిస్తుందో చూడాలి?







## స్టూడెంట్స్ మోటివేషనల్ స్పీచ్ ఇచ్చిన శర్వానంద్



యంగ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం ఒక మంచి విజయం కోసమా ఎదురుచూస్తున్నాడు. శర్వా ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. డిసెంబర్ లో బైకర్ తో మెప్పించడానికి సిద్ధమైన శర్వా..సంక్రాంతికి నారీ నారీ నడుమ మురారీ సినిమాతో రానున్నాడు. ఇక బైకర్ సినిమా రిలీజ్ కు దగ్గరపడుతుండటంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన శర్వా.. కాలేజ్ లను విజిట్ చేస్తూ స్టూడెంట్స్ తో మమేకమై సినిమాపై హైప్ క్రియేట్ చేస్తున్నాడు. తాజాగా గచ్చిబౌలిలోని రిజోనెన్స్ కాలేజ్ ఫెస్ట్ కి ముఖ్య అతిథిగా విచ్చేశాడు. శర్వా రాకతో స్టూడెంట్స్ మరింత సందడి చేశారు. ఇక ఈ ఫెస్ట్ లో బైకర్ గురించిన విశేషాలను శర్వా స్టూడెంట్స్ తో పంచుకున్నాడు. అంతేకాకుండా స్టూడెంట్స్ మోటివేషనల్ స్పీచ్ కూడా ఇచ్చాడు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా లేచి నిలబడాలని, తమ జీవితంలో నువ్వు ఏం చేయాలో.. ఏం చేయకూడదో ఎవరు చెప్పాల్సిన అవసరం లేదని.. నిన్ను నువ్వు నమ్మితే సక్సెస్ అదే వస్తుందని తెలిపాడు.' నేను కొన్ని విషయాలు మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

## కపూర్ ఫ్యామిలీపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ.. ట్రైలర్ చూశారా.!

బాలీవుడ్ స్టార్ కుటుంబం కపూర్ ఫ్యామిలీకి సంబంధించి నెట్‌ఫ్లిక్స్ వేదికగా డాక్యుమెంటరీ సిరీస్ రాబోతుంది. బాలీవుడ్ దిగ్గజ నటుడు రాజ్ కపూర్ 100వ బర్త్‌డే సందర్భంగా 'డైనింగ్ విత్ ది కపూర్స్' అనే పేరుతో రూపొందిన ఈ ఫ్యామిలీ డాక్యుమెంటరీ నవంబర్ 21 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. ఈ డాక్యుమెంటరీలో కపూర్ కుటుంబానికి చెందిన అగ్ర నటులు రణ్‌బీర్ కపూర్, కరిష్మా కపూర్, కరీనా కపూర్ ఖాన్ తదితర ప్రముఖులు తమ కుటుంబ అనుబంధాలు, జ్ఞాపకాలు, బాల్యం గురించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకోనున్నారు. బాలీవుడ్ లెజెండ్, పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్‌ల వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఈ కుటుంబంలోని ప్రస్తుత తరం స్టార్స్ జీవిత విశేషాలు అభిమానులకు ఆసక్తికరంగా మారనున్నాయి.